తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-24- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 28 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# 2047కి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక లక్ష్యం

## తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌కు కేబినెట్ ఆమోదం

### అన్ని విభాగాల భాగస్వామ్యంతో సమగ్ర ప్రణాళిక

### నీతి అయోగ్, ఐఎస్‌బీతో నాలెడ్జ్ భాగస్వామ్యం

- మహిళలు, రైతులు, యువత సంక్షేమానికి ప్రాధాన్యత
- రైతు భరోసా విజయోత్సవంగా రైతుల సమక్షంలో వేడుకలు
- తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణకు డిసెంబర్ 9 నిర్ణయం
- ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ అలైన్‌మెంట్‌కు ఆమోదం
- గోదావరి – బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు చర్యలు
- జూలైలో సీఎల్పీ సమావేశం, పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- రాష్ట్ర విభజన అంశాలపై రెండు రాష్ట్రాల చర్చలు
- కాళేశ్వరం నిర్మాణంపై సమాచారాన్ని కమిషన్‌కు అందజేయనున్న ప్రభుత్వం
- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీకి ఆమోదం
- మంత్రివర్గ సమావేశాలపై త్రైమాసిక సమీక్ష

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ' డాక్యుమెంట్‌ను రూపొందించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాలని నిర్ణయించింది. ఈ మేరకు విజన్ రూపకల్పన, ప్రణాళికల తయారీకి వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయనుంది.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు ఈ విజన్ డాక్యుమెంట్‌లో ఉండనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3.40 గంటల నుంచి రాత్రి 9.20 గంటల వరకు సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది.

మిగతా 2లో..

# మరో సభకు సిద్ధమైన సర్కార్

- ప్రభుత్వ విజయాన్ని ప్రజల మధ్య పంచుకునేందుకు రైతు భరోసా విజయోత్సవ సభ
- మంత్రి తుమ్మల కీలక ప్రకటన

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)




కాంగ్రెస్ సర్కార్ మరో సభకు సిద్ధమైంది. తెలంగాణ వ్యాప్తంగా రైతులకు అందించిన రైతు భరోసాపై.. ప్రభుత్వ విజయాన్ని ప్రజల మధ్య పంచుకునేందుకు మంగళవారం సాయంత్రం హైదరాబాద్ సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహ ప్రాంగణంలో "రైతు భరోసా విజయోత్సవ సభ" నిర్వహించనున్నట్టు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సభ ఏర్పాట్లను మంత్రి తుమ్మల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు పాల్గొననున్నారని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి రైతుభరోసా లబ్ధిదారులు హాజరుకాబోతున్నారు. రైతుల ఉత్సాహాన్ని ప్రోత్సహించేందుకు, వారి సంతోషాన్ని పంచుకునేందుకు ఈ సభను "రైతు నేస్తం వేదిక"గా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. రైతుల సాగు కార్యకలాపాలకు తొలకరిలో ముందుగానే భరోసా ఇచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల మేర నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని వెల్లడిరచారు. ఇది రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

మరోవైపు, గతంలో కాంగ్రెస్ నేత మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో దేశవ్యాప్తంగా రైతులకు రూ.70 వేల కోట్ల రుణమాఫీ చేసి అండగా నిలిచారన్నారు. అదే దారిలో ప్రస్తుతం తెలంగాణలో 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ వర్తించిందని మంత్రి తెలిపారు. సభ సందర్భంగా ఎలాంటి అవాంతరాలు కలగకుండా చూసేందుకు విద్యుత్, త్రాగునీరు, షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష జరిగింది. సంబంధిత శాఖల అధికారులతో కలిసి స్పష్టమైన సూచనలు చేసినట్టు మంత్రి తెలిపారు.

# బీసీ బిల్లుకు రాజకీయ రంగు పులమొద్దు

- పదేళ్ల పాలనలో బీసీలను పట్టించుకోని కవితకు ఇప్పుడు ప్రేమ ఎందుకని ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి గవర్నర్‌కు పంపిందని వెల్లడి
- కవితతో వేదిక పంచుకోవద్దని కృష్ణయ్యకు సూచన
- మంత్రి పొన్నం ప్రభాకర్


హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)



బీసీ బిల్లు అంశానికి రాజకీయ రంగు పులుముతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు బీసీల సంక్షేమాన్ని ఏమాత్రం

మిగతా 2లో..

# బీఆర్ఎస్ పథకాలను అటకెక్కించారు



- 'ఆత్మశుద్ధిలేని యాచార మదియేల.. భాండశుద్ధి లేని పాకమేల..' అన్నట్లు ఉంది కాంగ్రెస్ పరిస్థితి
- మేనిఫెస్టోలో ఊదరగొట్టిన హామీల అమలు సీఎం రేవంత్ రెడ్డి గాలికి వదిలేశారు
- బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'ఆత్మశుద్ధిలేని యాచార మదియేల.. భాండశుద్ధి లేని పాకమేల..' అన్నట్లు కాంగ్రెస్ పరిస్థితి ఉందని అన్నారు. సన్నాలకు బోనస్ బంద్..ఇందిరమ్మ ఆత్మీయ భరోసా బంద్.. గ్యాస్ బండకు రాయితీ బంద్.. రాజీవ్ యువ వికాసం అమలు కాకముందే బంద్.. బీఆర్ఎస్ ప్రారంభించిన గొర్రెల పంపిణీ మొత్తానికే ప్రభుత్వం బంద్ చేసిందని హరీష్ రావు ఆరోపించారు.

ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పాలనలో అన్ని పథకాలు బంద్ అయ్యాయని, మేనిఫెస్టోలో ఊదరగొట్టిన హామీల అమలు సీఎం రేవంత్ రెడ్డి గాలికి వదిలేశారని హరీష్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటితే చేతలు గడప దాటవని.. ప్రజలను నమ్మించడం, నయవంచన చేయడంలో కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు.

మిగతా 2లో..



- కాళేశ్వరంపై మా నిర్ణయమిదే..
- కాళేశ్వరం అవినీతిపై బండి సంజయ్ ఉమ్మడి అభిప్రాయం
- కాళేశ్వరం అవినీతిపై బండి సంజయ్ ఉమ్మడి అభిప్రాయం
- ప్రధాని మోదీ వ్యాఖ్యలే బీజేపీ స్టాండ్
- బీఆర్ఎస్ నేతల విమర్శలు విడ్డూరం
- కేటీఆర్ ప్రవర్తనపై రాజాసింగ్ విమర్శ

# కాళేశ్వరం ప్రాజెక్ట్ ముమ్మాటికీ అవినీతి ప్రాజెక్టే

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్ నేతలకు బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే గులాబీ పార్టీ నాయకులు అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. బండి సంజయ్‌పై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నానని అన్నారు.

మిగతా 2లో..

# కంచ గచ్చిబౌలి భూములపై విచారణ వాయిదా

- సుప్రీంకోర్టులో విచారణ నేపథ్యంలో హైకోర్టులో వాయిదా
- మూడు వారాల పాటు విచారణను వాయిదా వేసిన సీజే ధర్మాసనం

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో కొనసాగుతున్న విచారణ వాయిదా పడిరది. ఈ భూములకు సంబంధించి దాఖలైన పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై (పిల్) విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

వివరాల్లోకి వెళితే, కంచ గచ్చిబౌలిలోని వివాదాస్పద భూములను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల

మిగతా 2లో..



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 2047కి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



అనంతరం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో అన్ని శాఖలు, అన్ని విభాగాలు భాగస్వామ్యం పంచుకునేలా చూడాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆశిస్తున్న వృద్ధి లక్ష్యంగా ఎంచుకునే కార్యక్రమాలు, చేపట్టాల్సిన కార్యాచరణను విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరుస్తారు. విజన్ డాక్యుమెంట్ తయారీకి నీతి అయోగ్‌తో పాటు, ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ వంటి సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి నాలెడ్జ్ పార్టనర్లుగా వ్యవహరిస్తాయి.

కేంద్రం ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో సుస్థిర సమ్మిళిత అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల వృద్ధితో పాటు మహిళలు, రైతులు, యువకుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పదో వంతు సంపదను అందించే రాష్ట్రంగా తెలంగాణ వృద్ధి సాధించాలనే భారీ లక్ష్యంతో ఈ విజన్‌కు రూపకల్పన చేయాలని అధికారులకు కేబినెట్ దిశా నిర్దేశం చేసింది.

**రైతుల సమక్షంలో సంబరాలు**

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వానాకాలం పంటలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసాను విజయవంతంగా, రికార్డు వేగంతో అందించింది. సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. మిగిలిన రూ.400 కోట్లను మంగళవారం జమ చేయనుంది. కోటీ 49 లక్షల ఎకరాలకు ఈ సాయాన్ని పంపిణీ చేసింది. అతి తక్కువ వ్యవధిలో రాష్ట్రంలోని దాదాపు 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందించింది. ఈ ఘనత సాధించిన శుభ సందర్భాన్ని రైతుల సమక్షంలోనే ఉత్సవంగా జరుపుకోవాలని కేబినెట్ నిర్ణయించింది.

మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 2 వేల మంది రైతులతో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. సీఎం రేవంత్‌తో పాటు మంత్రివర్గం ఈ కార్యక్రమంలో పాల్గొననుంది. ఇక అన్ని జిల్లాల్లో రైతు వేదికలతో పాటు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు, సంబరాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సంబరాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆదేశించింది.

రాష్ట్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో డిసెంబర్ 9న ఈ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు.

హైదరాబాద్ చుట్టూ నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్ ప్రతిపాదనలకు కేబినెట్ తుది ఆమోదం తెలిపింది. అంతకుముందు ఆర్ అండ్ బీ విభాగం తయారు చేసిన మూడు ప్రతిపాదనలను పరిశీలించింది. అనంతరం చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కి.మీ.ల పొడవు ఉండే ఈ అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలిపింది.

తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఏపీ తలపెట్టిన గోదావరి -బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చట్టపరంగా, న్యాయపరంగా అడ్డుకునేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, అన్ని వేదికలను ఉపయోగించుకోవాలని కేబినెట్ తీర్మానించింది. ఒక చుక్క గోదావరి జలాలను కూడా నష్టపోకుండా చిత్తశుద్ధితో పోరాడాలని నిర్ణయించింది.

2016లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో 400 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించగా, దాని ఆధారంగానే బనకచర్ల ప్రాజెక్టును ఏపీ రూపొందించిందని మంత్రివర్గం పేర్కొంది. ఈ విషయాన్ని మరిచిపోయిన బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై అబద్ధాలతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారంటూ ధ్వజమెత్తింది.

ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణను సిద్ధంచేసేందుకు జూలై మొదటి వారంలో సీఎల్పీ సమావేశం నిర్వహించనుంది. ప్రాజెక్టుపై పూర్తి వివరాలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది.

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో ఇంకా అపరిష్కృతంగా ఉండిపోయిన అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల అధికారుల కమిటీల ఆధ్వర్యంలో మళ్లీ సమావేశాలను పునరుద్ధరించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీకి లేఖ రాయనుంది.

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా తెలియజేయాలనుకున్నా, సమాచారం ఇవ్వాలనుకున్నా ఈ నెల 30 లోగా ఇవ్వాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ రాసిన లేఖపై మంత్రివర్గం చర్చించింది. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని గడువులోగా కమిషన్‌కు అందజేయాలని నిర్ణయించింది.

సీఎస్ ఆధ్వర్యంలో సీనియర్ అధికారులకు ఈ బాధ్యత అప్పగించింది. మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు మేరకే బరాజ్‌లను నిర్మించినట్టు కమిషన్ ఎదుట విచారణకు హాజరైన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటల రాజేందర్ వాంగ్మూలం ఇచ్చారు.

నాటి మంత్రి హరీశ్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బరాజ్‌ల నిర్మాణంపై నిపుణుల కమిటీ సిఫారసులను ఆమోదించిన తర్వాతే మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని ఈటల, హరీశ్‌రావు కమిషన్‌కు వివరించారు.

ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘంతో పాటు మంత్రివర్గ సమావేశాల్లో అలాంటి నిర్ణయాలు ఏమీ జరగలేదని రుజువు చేసేందుకు గాను వాటికి సంబంధించిన మినిట్స్ కాపీలను కమిషన్‌కు ప్రభుత్వం అందించనుంది.

రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు క్రీడా ప్రమాణాలను పెంపొందించి 2036 ఒలంపిక్స్‌లో తెలంగాణ సత్తాను చాటాలనే ఉద్దేశంతో రూపొందించిన తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని కేబినెట్ ఆమోదించింది.

పరిపాలన సంస్కరణల్లో భాగంగా ఇకపై ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ సమావేశాలు నిర్వహించనుంది. మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలులో పురోగతిని సమీక్షించడానికి త్రైమాసిక సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారంను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్ గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో కమిషనర్లతో పాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది.

పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ క్యాన్సర్ చికిత్స నిపుణులు నోరి దత్తాత్రేయుడిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి అభివృద్ధితో పాటు, క్యాన్సర్ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల విషయంలో ఆయన సేవలను వాడుకోనుంది. ఎంఎన్‌జే ఆస్పత్రి అప్‌గ్రేడేషన్, సిబ్బంది నియామకానికి ఆమోదం తెలిపింది.

ఈ విద్యా సంవత్సరంలో బాసర ట్రిపుల్ ఐటీ కింద మహబూబ్‌నగర్‌లో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి ఏటా 180 మంది విద్యార్థులు చొప్పున 6 ఏళ్లలో 1080 మందికి అడ్మిషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతమైన హుస్నాబాద్‌లో శాతవాహన వర్సిటీ కింద ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి 240 మందికి అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించింది. శాతావహన వర్సిటీలో ఈ ఏడాది నుంచి చెరో 60 సీట్లతో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించింది.

# బీసీ బిల్లుకు రాజకీయ రంగు పులమొద్దు

(మొదటి పేజీ తరువాయి)



పట్టించుకోని కవిత, ఇప్పుడు వారి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం బీసీ బిల్లును శాసనసభలో ఆమోదింపజేసి, గవర్నర్ ఆమోదం కోసం పంపిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తక్కువ చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఇదే సందర్భంలో, బీసీ రిజర్వేషన్ల కోసం కవిత చేపట్టిన ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరిన ఎంపీ ఆర్. కృష్ణయ్య వైఖరిపైనా మంత్రి స్పందించారు. "బలహీన వర్గాల కోసం విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేసిన పెద్దన్న ఆర్. కృష్ణయ్య అంటే మా అందరికీ ఎంతో గౌరవం ఉంది. అయితే, పదేళ్లు అధికారంలో ఉండి బీసీలకు ఎలాంటి మేలు చేయని కవిత వంటి వారితో వేదిక పంచుకుని మీ గౌరవాన్ని తగ్గించుకోవద్దు" అని కృష్ణయ్యకు హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీ బిల్లును పంపామని, దాని ఆమోదం కోసం ఆర్. కృష్ణయ్య చొరవ తీసుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు.

# బీఆర్ఎస్ పథకాలను అటకెక్కించారు

(మొదటి పేజీ తరువాయి)

పాలన అంటే ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు తీర్చుకోవడం కాదని.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గొర్రెల పంపిణీ చేస్తామని అభయ హస్తం మేనిఫెస్టోలో ఊదరగొట్టారని.. గొర్రెల పంపిణీ దేవుడెరుగు, కట్టిన డిడి పైసలు కూడా వాపస్ ఇవ్వలేని దుస్థితి నెలకుందని తీవ్రస్థాయిలో విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు విని విని విసిగి పోయిన యాదవ, కురుమ సోదరులు గాంధీ భవన్‌కు గొర్రెలు తోలుకొని వచ్చి.. నిరసన తెలియచేసారని అన్నారు. మోసాన్ని గుర్తించి, అన్ని వర్గాల ప్రజలు ఏకమై గాంధీ భవన్‌కు పోటెత్తకముందే ప్రభుత్వం కళ్ళు తెరవాలన్నారు. చెప్పిన గ్యారెంటీలు, ఇచ్చిన హామీలు ఇకనైనా అమలు చేయకుంటే ప్రజల నుండి తిరుగుబాటు తప్పదని హరీష్ రావు అన్నారు.

`పంచాయతీ నిధులు విడుదల చేయాలి..

కాగా మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పెండిరగ్ బిల్లుల చెల్లింపుతో పాటు పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని మంత్రి సీతక్కకు ఆదివారం హరీశ్‌రావు లేఖ రాశారు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయి, పారిశుధ్యం పడకేసిందని తెలిపారు. చేసిన పనులకు బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఆ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం 9,350 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించిందని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు.



# కాళేశ్వరం ప్రాజెక్ట్ ముమ్మాటికీ అవినీతి ప్రాజెక్టే


(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ముమ్మాటికీ అవినీతి ప్రాజెక్టేనని ఆయన ఆరోపించారు. అందులో బీజేపీది, తమ నేతలది ఒకే అభిప్రాయమని రాజాసింగ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పినట్లుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని ఏటీఎం లాగా బీఆర్ఎస్ నేతలు వాడుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా చెప్పిన మాటలే తమ స్టాండ్ అని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ఈ ప్రాజెక్ట్‌ని రీడిజైన్ పేరుతో రూ.1.20 లక్షల కోట్లు పెంచలేదా అని నిలదీశారు. ఆనాడు స్వయం ప్రకటిత ఇంజనీర్‌గా అవతారం ఎత్తి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని చేపడితే.. ఈనాడు కేటీఆర్ ఎన్డీఎస్ఏ కంటే తానే తెలివైన మేధావిగా ప్రవర్తించడం సిగ్గుచేటని రాజాసింగ్ విమర్శించారు.

# కంచ గచ్చిబౌలి భూములపై విచారణ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

సంస్థకు (టీజీఐఐసీ) అప్పగించింది. ఈ భూములను అభివృద్ధి చేసి, ఐటీ కంపెనీలకు కేటాయించేందుకు టీజీఐఐసీ ప్రణాళికలు కూడా సిద్ధం చేసింది. సుప్రీంకోర్టులో విచారణలో ఉందని ధర్మాసనం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉన్నందున, ఇక్కడ విచారణను కొనసాగించడం ఈ క్రమంలో, సదరు భూములను యంత్రాలతో చదును చేసే పనులు ప్రారంభించడంతో, ఈ చర్యలను నిలుపుదల చేయాలని కోరుతూ హైకోర్టులో వేర్వేరుగా నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా, టీజీఐఐసీకి భూములను కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. సదరు భూములను యంత్రాలతో చదును చేసే పనులు ప్రారంభించడంతో, ఈ చర్యలను నిలుపుదల చేయాలని కోరుతూ హైకోర్టులో వేర్వేరుగా నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా, టీజీఐఐసీకి భూములను కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే, కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించిన కేసు ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణలో ఉందని ధర్మాసనం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉన్నందున, ఇక్కడ విచారణను కొనసాగించడం సమంజసం కాదని భావించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం, తదుపరి విచారణను మూడు వారాల పాటు వాయిదా వేసింది. దీంతో ఈ భూముల భవితవ్యంపై మరికొంత కాలం సందిగ్ధత కొనసాగనుంది.






# స్థానిక సంస్థల ఎన్నికల తీర్పు రిజర్వ్

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

స్థానిక సంస్థల ఎన్నికల పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇవాళ (సోమవారం) విచారణ జరిపింది. ఆరు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున న్యాయవాదులు తమ వాదనలను కోర్టుకు వినిపించారు. ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలని హైకోర్టు పిటీషనర్లను ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని న్యాయస్థానం నిలదీసింది. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే ఇంకా పూర్తి అవ్వలేదని కొంత సమయం కావాలని కోర్టుని ప్రభుత్వం కోరింది.

ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ అడిగింది. ఎన్నికలైనా పెట్టాలని లేదా పాత సర్పంచ్‌లనే కొనసాగించాలని పిటీషనర్లు వాదనలు వినిపించారు. ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలనే నిబంధన ఉందని.. కానీ ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించలేదని పిటీషనర్లు వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పిటీషనర్లు, ప్రభుత్వం, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా 2024 ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే.



# హెచ్చరించిన ఐఎండీ

తెలంగాణలో రాగల ఐదురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడిరచింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో వర్షాలు పడుతాయని చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, సరిహద్దు వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 5.8 నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని చెప్పింది. తెలంగాణలో రాగల ఐదురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడిరచింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో వర్షాలు పడుతాయని చెప్పింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కొనసాగుతాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు పడుతాయని పేర్కొంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# అప్లికేషన్ రిజెక్ట్ చేస్తే కారణం చెప్పాల్సిందే..!

## భూ సమస్యల దరఖాస్తులపై సర్కార్ నిర్ణయం..!!

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**




ఇష్టమొచ్చినట్లు అప్లికేషన్లను తిరస్కరిస్తున్న అధికారులు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు తిరస్కరణకు లిఖితపూర్వకంగా కారణం చెప్పాలన్న సర్కార్ రెవెన్యూ సదస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షలకు పైగా దరఖాస్తులుప్రభుత్వ నిర్ణయంతో రైతులకు మేలు హైదరాబాద్, రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఏ ఒక్క భూ సంబంధిత దరఖాస్తునూ.. నిర్దిష్టమైన, లిఖితపూర్వకమైన కారణం లేకుండా తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేసింది.
తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు ఇష్టమొచ్చినట్లు అప్లికేషన్లు తిరస్కరిస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అందుకు కచ్చితమైన, సరైన కారణాన్ని చూపాల్సిందేనని ఆదేశించింది. గతంలో ధరణి పోర్టల్లో అప్లికేషన్లు పెట్టుకున్నప్పటికీ..వాటిని కారణంగా లేకుండా కింది స్థాయి సిబ్బంది రిజెక్ట్ చేయడంతో ఇప్పుడు మళ్లీ రెవెన్యూ సదస్సుల్లో 8 లక్షలకు పైగా అప్లికేషన్లు వచ్చినట్లు ప్రభుత్వం గుర్తించింది.
ఫీల్డ్ లెవెల్ లోనూ తహసీల్దార్లు ఇష్టారీతిన దరఖాస్తులు తిరస్కరించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సర్కారు, దీనికి కళ్లెం వేసేందుకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. గతంలో మాదిరి ఇష్టమొచ్చినట్లు వ్యవహరించొద్దని, అక్రమాలకూ తావివ్వకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నది.
వాస్తవానికి భూ భారతి చట్టం ప్రకారం.. భూ భారతి పోర్టల్లో ఏ అప్లికేషన్ పెట్టుకున్నా.. వాటిని రిజెక్ట్ చేస్తే కారణం చెప్పాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆఫ్లైన్లో దరఖాస్తులు స్వీకరించడం పెద్దఎత్తున అప్లికేషన్లు రావడంతో వాటిని డిస్పోజ్ చేసేందుకు లేనిపోని కారణాలు పెట్టి తిరస్కరణ చేయడం ఉండకూడదని, అవినీతికి ఆస్కారం ఉండొద్దని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. దీంతో రైతులు లబ్ధి పొందనున్నారు.

**మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగొద్దు**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన వచ్చింది. ఈ సదస్సుల్లో భూమికి సంబంధించిన రకరకాల సమస్యలపై ప్రజల నుంచి 8 లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. ఇందులో వారసత్వ భూముల బదిలీలు, భూ రికార్డుల సవరణలు, సరిహద్దు వివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాల జారీ, మిస్సింగ్ సర్వే నంబర్లు, నాలా కన్వర్షన్లు వంటి ఎన్నో అప్లికేషన్లు ఉన్నాయి.
అయితే, ఈ దరఖాస్తుల్లో పైలట్ మండలాల్లో చాలా వరకు ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండానే అధికారుల నుంచి అప్లికేషన్లు తిరస్కరణకు గురవుతున్నాయనే ఫిర్యాదులు ప్రభుత్వాన్ని చేరాయి. దీనివల్ల ప్రజలు మళ్లీ మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని, కాలయాపనతో పాటు భూ భారతి పోర్టల్ లో అప్లికేషన్ పెడితే ఆర్థికంగా కూడా నష్టపోతున్నారని ప్రభుత్వం గుర్తించింది.
దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం.. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన లక్షలాది దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, వాటిని తిరస్కరించే ముందు పరిశీలించి సరైన కారణం చెప్పాలని ప్రభుత్వం ఆదేశించింది. కొంతమంది తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు దరఖాస్తులను పరిశీలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, సరైన కారణాలు చూపకుండానే తిరస్కరిస్తున్నారని ఇటీవల ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు.
ఇకపై తిరస్కరణకు గురైన ప్రతి దరఖాస్తుకు, అందుకు గల పూర్తి కారణాన్ని వివరంగా అప్లికెంట్కు తెలియజేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ దరఖాస్తు తిరస్కరణకు గురైతే.. ఆ కారణం చట్టబద్ధంగా ఉందా? లేదా? అనే అంశాన్ని కూడా పరిశీలించే అవకాశం దరఖాస్తుదారులకు లభిస్తుంది. అంతేగాకుండా, అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి వస్తుంది.

**మరో ధరణి కావొద్దనే..**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్.. రైతులను ముప్పుతిప్పలు పెట్టింది. లక్షల సంఖ్యలో కొత్త భూ సమస్యలు తెరపైకి వచ్చాయి. ఎన్నికల ప్రచారంలో ధరణిని బంగాళఖాతంలో వేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి సలహాలు, సూచనలతో భూ భారతి చట్టాన్ని తెచ్చింది.
ఇందులో అప్పీళ్లు, ల్యాండ్ ట్రిబ్యునళ్ల వ్యవస్థను తీసుకొచ్చింది. భూ సమస్యల అప్లికేషన్ తిరస్కరిస్తే కారణం చెప్పాలని స్పష్టం చేసింది. దాంతో పాటు తప్పు చేసే అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకునే నిబంధన కూడా పెట్టింది. గతంలో తమ దరఖాస్తు ఎందుకు తిరస్కరించబడిందో తెలియక నిస్సహాయ స్థితిలో ఉన్న ప్రజలకు ఇప్పుడు తమ హక్కులను తెలుసుకునే అవకాశం లభిస్తుంది. సరైన కారణం లేకపోతే ఉన్నతాధికారులకు అప్పీల్ చేసుకునే చాన్స్ కూడా లభిస్తుంది.

---



## విద్యుత్ ప్రమాదానికి గురైన బాలాజీ కుటుంబానికి విద్యుత్ శాఖ ఉద్యోగుల అసోసియేషన్ ఆర్థిక సాయం

**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ జిల్లాలోని ఏనుగల్లు సెక్షన్లో విధులు నిర్వర్తిస్తున్న అసవద్ బాలాజీ అన్మాండ్గా పని చేస్తుండగా తీవ్ర విద్యుత్ ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆయన తన రెండు కాళ్లను కోల్పోవాల్సి వచ్చింది. ఘటన అనంతరం విద్యుత్ శాఖ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటుచేసుకుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
ఈ నేపథ్యంలో, బాధిత బాలాజీ కుటుంబానికి మద్దతుగా విద్యుత్ అసోసియేషన్ నాయకత్వం ముందుకొచ్చింది. జూన్ 23న అసోసియేషన్ సభ్యులు బాధితుడి కుటుంబాన్ని కలవడం ద్వారా ధైర్యాన్ని నూరిపోసారు. సంఘటనకు కారణమైన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరగాలని కోరుతూ సిఎండిను కలిసి వినతిపత్రం అందించారు.
అదేవిధంగా, బాలాజీ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా విద్యుత్ అసోసియేషన్ తరఫున రూ.5,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కంపెనీ అధ్యక్షులు, కార్యదర్శులు అర్జీ జాటోత్, అజ్మీర్ శ్రీరామ్ నాయక్, రాజశేఖర్, లక్ష్మణ్ నాయక్, వరంగల్ మరియు హనుమకొండ శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధితుడికి మెరుగైన వైద్యం మరియు నిరంతర సహాయం అందించాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు.

---

# అదనపు కలెక్టర్ డా. శ్రీజ చేతుల మీదుగా ఎన్.ఎస్.పి.సి.- 2025 పోస్టర్ ఆవిష్కరణ

- **జూలై 1 నుంచి విద్యార్థుల కోసం పర్యావరణ క్విజ్ పోటీకి నమోదు ప్రారంభం**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



ఖమ్మం జిల్లాలో నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ (ఎన్ఎస్పిసి) 2025 పోస్టర్ను అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ కలెక్టరేట్ లో సోమవారం ఆవిష్కరించారు. నేషనల్ గ్రీన్ కోర్ ఈ పోస్టర్ రూపొందించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల పర్యవసానాల నుండి రక్షణకు విద్యార్థులలో పర్యావరణ నైపుణ్యాలు, జీవనశైలిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, మొక్కలు నాటటం, నీటి సంరక్షణ, వ్యర్థాల వేరుచేసే అలవాట్లను విద్యార్థులలో అలవరచాలని అన్నారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు ఈ పోటీలో పాల్గొన వలసిందిగా అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. "హరిత -ది వే ఆఫ్ లైఫ్" అనే థీమ్పై దేశవ్యాప్తంగా ఎన్.ఎస్.పి.సి. పోటీని పర్యావరణ సంరక్షణ గతివిధి (పీ ఎస్ జీ) నిర్వహిస్తోందని, ఈ పోటీకి జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ పోటీకి కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహాయ సహకారం ఉందన్నారు. ఫలితాలు ఆగస్టు 30న ప్రకటించబడతాయన్నారు.
1వ తరగతి నుండి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాలలో పోటీ నిర్వహించబడుతుంది. ఈ సి ఓ మిత్రా యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని, హిందీ, ఇంగ్లీష్, మరిన్ని భాషలలో క్విజ్ లభ్యమవుతుందని, రిజిస్ట్రేషన్ ఫీజు లేదని అదనపు కలెక్టర్ అన్నారు. మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.
గత సంవత్సరాలలో లక్షలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఎన్.ఎస్.పి.సి. పోటీలో ఈ ఏడాది మరింత విస్తృతమైన విద్యార్థుల బాగస్వామ్యం ఆశిస్తున్నామన్నారు. అన్ని విద్యా సంస్థల ప్రధానులూ, ఉపాధ్యాయులూ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. పోటీ ఐదు విభాగాల్లో నిర్వహించబడుతుందని, 1వ తరగతి నుండి 5వ తరగతి, 6వ తరగతి నుండి 8వ తరగతి, 9వ తరగతి నుండి 12వ తరగతి, డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు ఇంతే కాక ఇతరులు / సామాన్య పౌరులు కూడా పాల్గొనవచ్చని అన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి ఈసర్టిఫికెట్ లభిస్తుందని, విద్యా సంస్థలకూ ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుందని, వివరాలకు:https://ecomitram.app/nspc సంప్రదించాలని అదనపు కలెక్టర్ అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్, సిఎంఓ రాజశేఖర్, అకడమిక్ అధికారి రామకృష్ణ, జిసిడబ్ల్యుఓ తులసి, వివిధ మండలాల ఎంఇఓ లు పాల్గొన్నారు.

---



## పాడి కౌశిక్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి

- **జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గౌర్రె కిరణ్**

**హసన్ పర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యేపాడి కౌశిక్ రెడ్డి పై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గౌర్రె కిరణ్, హసన్ పర్తి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిగులా సురేష్ మాట్లాడుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై సోమవారం రోజున హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. కౌశిక్ రెడ్డి ఒక రాజకీయ బ్రోకర్ అని కెసిఆర్ సభ కోసం క్వారీ యజమానిని బ్లాక్మెయిల్ చేసి 50 లక్షలు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించి క్వారీ యజమాని కేసు చేస్తే దుబాయ్ పారిపోతుండగా ఎయిర్పోర్టులో పట్టుకొని అరెస్టు చేశారని అన్నారు. మర్రిపల్లిగూడెం అభివృద్ధి చేస్తానని క్వారీ యజమాని దగ్గర డబ్బులు తీసుకొని బ్లాక్ మెయిల్ చేశాడని ఉద్యోగాల పేరుతో కమిషన్లకు కక్కుర్తి పడ్డాడని కాలేశ్వరం ప్రాజెక్టులో కమిషన్ లకు కక్కుర్తి పడ్డది టిఆర్ఎస్ పార్టీ కాదా అని ఇంకొక్కసారి ఎమ్మెల్యే నాగరాజు పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కిరణ్, ఎర్రగట్టు దేవస్థానం చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, సౌరం చరణ్ తేజ, పెద్దమ్మ రామ్ నరసింహులు, బోయిని శశికాంత్, శీలం వంశీ,భగత్,జన్ను ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

---

# రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపై... ప్రభుత్వం పునరాలోచించాలి

- **మార్కెట్ వ్యాల్యూ పెంచితే రిజిస్ట్రేషన్ స్టాంప్...డ్యూటీ 3%* చేయాలి.**
- **హైడ్రాతో రియల్ ఎస్టేట్ వ్యాపారం సర్వనాశనం.**
- **ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాలను నిర్మించాలి.**
- **సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడు పంతంగి వీరస్వామి గౌడ్.**

**సూర్యాపేట,తెలంగాణ ముచ్చట్లు:**



రాష్ట్ర ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపై పునరాలోచించాలని ఒకవేళ మార్కెట్ వ్యాల్యూ పెంచితే రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ 3% చేయాలని తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు, సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ గార్డెన్ దగ్గర జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ చార్జీలను గత ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. తిరిగి నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే సామాన్య ప్రజలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కానుందని వివరించారు. మార్కెట్ విలువలు పెరగడం వల్ల సామాన్య ప్రజలకు బిల్డింగ్ పర్మిషన్ తో పాటు ఎల్ ఆర్ ఎస్ కు విపరీతంగా డబ్బులు ఖర్చు అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ రేట్లు పెంచడంతో సామాన్య ప్రజలు కనీసం ఇంటిని నిర్మించుకునే పరిస్థితిలో ఉండలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న చార్జీలని అమలు చేయాలని పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఎల్ అర్ ఎస్ కోసం ఆన్లైన్లో రూ.10,000 రూపాయలు చెల్లించిన వారికి మున్సిపాలిటీ అధికారులు ఆప్షన్ తీసుకోవట్లేదని తెలిపారు. ఎల్ఆర్ఎస్ పెండింగ్ లేకుండా రెగ్యులర్ చేసేటట్టు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ కొరకు వెయ్యి రూపాయలు కట్టినవే అమలు చేస్తున్నారు తప్ప పదివేల రూపాయలు చెల్లించిన వారికి ఎల్లారీస్ రెగ్యులరైజేషన్ చేయడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా . 142 సబ్ రిజిస్టర్ ఆఫీసులు ఉన్న వాటిలో పదుల సంఖ్యలో మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని అద్దె భవనాలకు బదులుగా ప్రభుత్వం నూతన సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేటలో కృష్ణ కాలనీలో గత 20 సంవత్సరాల క్రితమే సబ్ రిజిస్టర్ కార్యాలయానికి ఎనిమిది గుంటల స్థలం భూమి యజమానులు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు రిజిస్ట్రేషన్ చేశారని చెప్పారు. నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హైడ్రా వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సర్వనాశనమైందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడ్డ ఎన్నో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ పట్టణ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్, రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ జిల్లా గౌరవ సలహాదారుడు దేవత్ కిషన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి పాల సైదులు, జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి అంజయ్య గౌడ్, పట్టణ గౌరవ సలహాదారుడు, మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు ఐతగాని మల్లయ్య గౌడ్, ఆకుల మారయ్య గౌడ్, పట్టణ కార్యదర్శి గిరీశం, పట్టణ ఉపాధ్యక్షుడు బానోతు జానీ నాయక్, సత్యనారాయణ రెడ్డి, నాగయ్య, పట్టణ కార్యదర్శి రాపర్తి జానయ్య, పట్టేటీ కిరణ్, సారగండ్ల కోటేషూ జిల్లా ఉపాధ్యక్షుడు కోడి లింగయ్య,కిషోర్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

- **చిల్పూర్లో బీజేపీ ఘన నివాళులు**

**చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:**

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని చిల్పూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు గంటే ఉపేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ, దేశ ఏకత, సమగ్రత కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని చెప్పారు. జమ్మూ కాశ్మీర్ను భారత దేశంలో ఒకటిగా విలీనం చేయాలన్న ఆశయంతో పోరాడిన వ్యక్తి ముఖర్జీ అని, ఆయన ప్రాణ త్యాగాన్ని దేశ ప్రజలంతా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.




కార్యక్రమంలో జనగాంజిల్లా కార్యవర్గ సభ్యుడు పెండ్యాల దిలీప్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, మండల నాయకులు ముక్కెర రమేష్ యాదవ్, తోట రంజిత్ కుమార్, సాదం భీమన్న యాదవ్, కండ్లకొల ప్రవీణ్, కన్నెబోయిన అఖిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ కార్యకర్తలు, అభిమానులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు విడుదల చేసిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదే

◆ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**




రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసి, రాష్ట్ర రైతులకు గణనీయమైన ఊరటను అందించిన ఘనత ఇందిరమ్మ ప్రజాప్రభుత్వానిదేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రవ్యాప్తంగా 1.49 కోట్ల ఎకరాలకు రైతు భరోసా నిధులు విడుదల చేసిన ప్రభుత్వం, ప్రతి రైతుకు ఎకరాకు రూ.12,000 చొప్పున ఆర్థిక సాయం అందించిందన్నారు. రైతులకు ఉచితంగా విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2 లక్షల రుణ మాఫీ, సబ్సిడీ గ్యాస్ మరియు సన్న బియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు.

జూన్ 16 నుంచి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల వద్ద విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల కేంద్రాల్లో భారీ స్థాయిలో సభలు జరుగుతాయని పేర్కొన్నారు. సచివాలయం ఎదుట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు ఉద్దేశించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిత్యం శ్రమిస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.



# రైతుల ఖాతాల్లో 406 కోట్ల 36 లక్షల రైతు భరోసా నిధులు జమ...

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు 406 కోట్ల 36 లక్షల రైతు భరోసా నిధులు జమ చేసామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో 3 లక్షల 53 వేల 794 మంది రైతుల ఖాతాల్లో మొత్తం 436 కోట్ల 84 లక్షల 65 వేల 365 రూపాయలు జమ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 15 ఎకరాల వరకు వున్న 3 లక్షల 31 వేల 397 మంది రైతులకు 406 కోట్ల 36 లక్షల 62 వేల 570 రూపాయలను రైతు భరోసా వానాకాలం 2025 క్రింద రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజావాణి అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి అర్జీలు స్వీకరించారు.

ఖమ్మం పట్టణం పంపింగ్ వెల్ రోడ్డు గ్రీన్ మార్కెట్ ప్రాంతానికి చెందిన కొప్పు ప్రభావతి, కొప్పు పద్మావతి, కొప్పు సంపత్ కుమార్ లు 30వ డివిజన్ సర్వే నెంబర్ 135, 136 లో తమ ముగ్గురికి 4716 చదరపు గజాల స్థలం ఉందని, ఇందులో 616 గజాలు నగర పాలక సంస్థ ఆక్రమించి పార్క్ కట్టారని, తమ భూములు తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఖమ్మంకు రాస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చింతకాని గ్రామానికి చెందిన పి. జగన్నాథం తాను నిరుపేద దివ్యాంగుడినని, తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన సి.హెచ్. రామారావు సర్వే నెంబర్ 220 నందు 2 ఎకరాల 27 గుంటల వ్యవసాయ భూమి ఉందని, దీనిని కాలువ అలైన్మెంట్ కోసం సేకరణ చేశారని, మారిన అలైన్మెంట్ ప్రకారం ఒక ఎకరం 20 గుంటలు మాత్రమే స్వీకరించారని, సేకరించిన భూమిలో ఒక ఎకరం 7 గుంటల భూమి మిగిలిందని, దీనిని తిరిగి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ పరిశీలించి నివేదికను 7 రోజులలో అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కొణిజర్ల మండలం బొట్లకుంట గ్రామానికి చెందిన గుర్రం అమృతమ్మ తన భర్తకు అంగవైకల్యం ఉందని, తాము చాలా పేదరికంలో ఉన్నామని, తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణిలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో సిహెచ్. స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి...

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నాడు, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సీజనల్ వ్యాధుల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.


జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో వచ్చే అవకాశం ఉందని, వీటి నియంత్రణకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు అధికంగా అవగాహన లేకుండా ఉండడం వలన, సరైన పారిశుధ్యం లేని ప్రాంతాలలో అధికంగా వస్తుంటాయని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులను పూర్తి స్థాయిలో నియంత్రించగలమని అన్నారు. చికిత్స కంటే, నివారణ ఎంతో మేలని కలెక్టర్ అన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించక పోవడం వల్ల డయేరియా అధికంగా వస్తుందని, ఇది పిల్లలకు తొందరగా అటాక్ అవుతుందని అన్నారు. ప్రతి పి.హెచ్.సి., సబ్ సెంటర్ ల వద్ద అవసరానికి మించి 10 శాతం బఫర్ స్టాక్ తో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని అన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజూ ఉదయం ప్రేయర్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, పేరెంట్ టీచర్స్ మీటింగ్ లో దీనిపై చర్చ పెట్టాలని అన్నారు. గత సంవత్సరం అధికంగా కేసులు నమోదైన ప్రాంతాలను హాట్ స్పాట్ లుగా ఎంపిక చేసి అక్కడ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల వద్ద ఎటువంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తి జరగకుండా స్పెషల్ శానిటేషన్ బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు స్టాక్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని, తక్కువ ఉంటే వెంటనే దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. డెంగ్యూ వైరస్ సాంపిల్స్ టెస్టింగ్ విస్తృతంగా చేయాలని అన్నారు. లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆసుపత్రులలో టెస్టింగ్ చేయాలని, ప్రతి ఏరియా ఆసుపత్రి, పి.హెచ్.సి వద్ద అవసరమైన కిట్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పోరేషన్ లో ప్రత్యేక పారిశుధ్య చర్యలను ప్రతి వారం వర్షా కాలం సీజన్ ముగిసే వరకు చేయాలని అన్నారు. ప్రతి శుక్రవారం ఇంటింటికి వెళ్లి నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పారిశుద్ధ్య జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పాత కూలర్లు, కొబ్బరి బోండాలు, పగిలిన కుండలు, ఉపయోగం లో లేని పాత్రలు, టైర్ లలో నీరు నిల్వ ఉండకుండా చూసు కోవాలని, సీజనల్ వ్యాధులను గత ఏడాది నుంచి ఇప్పటికి ఎంత తగ్గించామనే అంశం పై మన పని తీరు ఆధారపడి ఉంటుందని అన్నారు. సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ హాస్టల్స్, కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని అన్నారు. 7, 8 వ తరగతి పిల్లలతో సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ కమీటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణ కోసం స్థానికంగా అందుబాటులో ఎన్.డి.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలు ....

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని జిల్లాలో వరద విపత్తుల నిర్వహణ కోసం ఎన్.డి.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను ముందస్తుగా స్థానికంగా అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో గత ఏడాది వచ్చిన భారీ వరదల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా కేంద్రంలో 24 సభ్యులతో కూడిన ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందం, 24 సభ్యులతో కూడిన ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలను సమాయత్తం చేశామని, వీరికి అవసరమైన అన్ని రకాల సామాగ్రి అందుబాటులో పెట్టుకున్నామని, రానున్న రోజులలో ఎటువంటి పరిస్థితులు వచ్చిన, ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలి

◆ జిల్లాలో మొక్కలు నాటే నిర్దేశిత లక్ష్యం చేరే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి

◆ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**



జిల్లాలో నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమంలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు సంబంధిత శాఖల అధికారులు మొక్కలను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, ఇతర జిల్లా అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంపీఓలతో వన మహోత్సవం మొక్కలను సిద్ధం చేయడంపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం, మొక్కలు నాటే కార్యక్రమం పై చేస్తున్న ఏర్పాట్లను గురించి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను జిల్లా కలెక్టర్ కు వివరించారు. అదేవిధంగా కుడా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే వన మహోత్సవ నిర్దేశిత మొక్కల లక్ష్యాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం 23 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు గుంతలను తీసి సిద్ధంగా ఉంచాలన్నారు. అదేవిధంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చేయాల్సిన ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో భాగంగా సామూహిక మరుగుదొడ్లు, సామూహిక వ్యక్తిగత ఇంకుడు గుంతలు, ఇందిరమ్మ ఇండ్లకు, ఇతర గృహాలకు అర్హులైన లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవోలకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

# హన్మకొండక్ జిల్లా రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు జమ

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

రైతులకు పంట పెట్టుబడి సహాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రైతులకు మద్దతుగా నిలుస్తుందని హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ తెలిపారు. హనుమకొండ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రైతుల ఖాతాల్లో వానాకాలం లో పంటల సాగుకు పెట్టుబడి సహాయాన్ని సోమవారం జమ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 14 మండలాల్లోని 163 గ్రామాలకు చెందిన 141364 మంది రైతుల ఖాతాలలో రైతు భరోసా కింద రూ. 148.74 కోట్లను జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ వెల్లడించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

◆ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు దరఖాస్తులను అందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 186 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జడ్పీ సీఈవో విద్యాలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# అందమెక్కడున్నది...?



అందమెక్కడున్నది...?
గలగల పారే సెలయేరు లోనా......
ఊహూ
జలజల దూకే జలపాతం లోనా...
ఊహూ

అందమెక్కడున్నది...?
పసి పిల్లల బోసి నవ్వుల్లోనా........
ఊహూ
గుభాళించే గులాబీ పువ్వుల్లోనా...
ఊహూ

ఇదిగో...అందమిక్కడున్నది...
అందాల నటుడు...
ఆంధ్రుల ఆరాధ్య దైవం...
నటరత్న నటసార్వభౌమ...
శ్రీ నందమూరి తారాక రామారావు
గారి
చిరునవ్వులో... నవరస భరిత
నటనలో

అందమెక్కడున్నది...?
ఉదయించే తొలిపొద్దులోనా....
ఊహూ
ఊరించే చెలి ముద్దులోనా.......
ఊహూ

అందమెక్కడున్నది...?
మత్తెక్కించే మల్లె మొగ్గల్లోనా...
ఊహూ
అమ్మాయిల లేత బుగ్గల్లోనా....ఊహూ

ఎంతసేపు చూసినా...
ఎన్ని సార్లు చూసినా...
కళ్ళు తిప్పుకోలేని తనివి తీరని
పదేపదే మరీ మరీ చూడాలనిపించే...

అందమెక్కడున్నది...?
ఆశలురేపే కలువభామలోనా...
ఊహూ
అందాల చందమామలోనా......
ఊహూ

సృష్టించిన బ్రహ్మ ఆశ్చర్యపోయేంతగా
కోటి సూర్యకిరణ కాంతుల్ని విరజిమ్మే
మాఅన్న "ముచ్చటైన
ముఖారవిందంలో...
మరి ఊ...అంటారా...ఊహూ
అంటారా..?

అందమెక్కడున్నది...?
పరిమళించే పూలరెమ్మలోనా...
ఊహూ
బంగారు బాపు బొమ్మలోనా.....
ఊహూ

అందమెక్కడున్నది...?
నింగిలో నవ్వే నక్షత్రాలలోనా...
ఊహూ
నిండు పున్నమి వెన్నెలలోనా...ఊహూ

అందమెక్కడున్నది...?
రంగుల రామ చిలుకలోనా.....ఊహూ
నాట్యమాడే మయూరిలోనా...ఊహూ



రచన:
కవిరత్న
సాహిత్యధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి,
అత్తాపూర్, హైదరాబాద్
చరవాణి...9110784502

# "వేశ్యా పతివ్రత"

తల్లితండ్రుల కులమత పంతంలో
కూతురి కన్నీటితో తడిసిన
పరువులెన్నో

సంప్రదాయ సంకెళ్లతో సన్నగిల్లిన సఖి
ఆశలెన్నో

మెత్తటి పసుపుతాడు కొయ్యలకు
మూడుముళ్ల ఉరి వేయబడ్డ వనితల
మనసులెన్నో

మనువాడిన మొగుడితో మరణం
వరకు మానసిక వనవాసం చేసే
శీతలెందరో

ఆర్థిక స్వేచ్ఛకై ఆశయాలను
పంజరంలోకి నెడుతూ ఏడడుగులు
నడిచిన అతివలెందరో

బిడ్డల సజీవ సమాధులపై కుల
అహంకార సౌధాలను నిర్మించిన
కన్నవారెందరో

పరువు ప్రతిష్టల పరదాల చాటున
ప్రతి రేయి పతనమయ్యే
వేశ్యా పతివ్రతల తనువులెన్నో?



నేపా. సంతోష్ అచ్యుత్ కుమార్, అసిస్టెంట్
ప్రొఫెసర్ కాళోజి ప్రతిభ పురస్కార
గ్రహీత,8639442397.

# ఉచిత సివిల్ సర్వీసు శిక్షణకు
# దరఖాస్తుల ఆహ్వానం

◆ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేద విద్యార్థులకు ఉచిత సివిల్ సర్వీసు శిక్షణను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించి దరఖాస్తుల ఆహ్వానం కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.

తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాదులో బంజారాహిల్స్ రహదారి సంఖ్య 14లో, కేబీఆర్ పార్క్ ఎదురుగా ఉన్న అధ్యయన కేంద్రం ద్వారా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసు అభిరుచి పరీక్ష 202526 విద్యా సంవత్సరానికి ఉచిత శిక్షణ అందించనున్నారు.

ఈ శిక్షణ కోసం రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన నిరుద్యోగులైన, అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ వర్గాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తిచేసిన వారు, వార్షిక కుటుంబ ఆదాయం మూడు లక్షలు మించకుండా ఉండే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆసక్తిగల వారు దరఖాస్తును ఆన్‌లైన్‌లో http://tsstudycircle.co.in అనే వెబ్‌సైటు ద్వారా జూలై 7 వరకు సమర్పించవచ్చు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు జూలై 13న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో మెరిట్ ఆధారంగా ఎంపికైన వారికి హైదరాబాదులోని బంజారాహిల్స్ కేంద్రంలో పదిహేను నెలలపాటు ఉచిత వసతి, భోజనంతో కూడిన శిక్షణను అందించనున్నారు.

ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు తప్పక వినియోగించుకోవాలని, ప్రభుత్వాల ద్వారా అందిస్తున్న ఈ వనరును తమ లక్ష్యసాధన కోసం ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు.

కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా అభివృద్ధి అధికారి గణేష్, మండల అభివృద్ధి అధికారులు రాథోడ్ రమేష్, నారాయణ, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి మీనా శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి నిర్మల, జిల్లా స్థాయి అధికారులు, తెలంగాణ ఎస్సీ అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా సంచాలకుడు డాక్టర్ జగన్ మోహన్, కనకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎస్ కీలక వాంగ్మూలం

◆ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) దూకుడు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)



ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) దూకుడు పెంచింది. అందులోభాగంగా సోమవారం ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ (ఎస్ఐబీ) రివ్యూ కమిటీ ప్యానల్‌ను తప్పుదోవ పట్టించిందని తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి వాంగ్మూలం ఇచ్చింది. ఫోన్ ట్యాపింగ్ కోసం ఎస్ఐబీ పంపిన నెంబర్లపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు మాజీ సీఎస్ ఈ సందర్భంగా వాంగ్మూలం ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు స్టేట్‌మెంట్‌ను సైతం సిట్ అధికారులు రికార్డు చేశారు. మావోయిస్టు సానుభూతిపరులు ఉగ్రవాద సంబంధిత సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నారని ఎస్ఐబీ నుంచి రివ్యూ కమిటీకి లేఖ ఇచ్చినట్లు గుర్తించారు. మరోవైపు ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేతల వాంగ్మూలాలను సిట్ అధికారులు నమోదు చేస్తున్నారు. ఆ క్రమంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇక సాధారణ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో రేవంత్ రెడ్డి బరిలో దిగిన సమయంలో.. ఆయనతోపాటు ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఫోన్లు సైతం ట్యాప్ అయినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించారు. అలాగే వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నేత బిళ్ల సుధీర్ రెడ్డి వాంగ్మూలాన్ని సైతం నమోదు చేశారు. ఆ క్రమంలో వాంగ్మూలాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.

# డయాగ్నోస్టిక్స్ సేవల్లోకి అమెజాన్

ఇంటి దగ్గరే శాంపిల్స్ సేకరణ

(తెలంగాణ ముచ్చట్లు)

ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా.. తన ఆరోగ్య సేవల విభాగాన్ని మరింత విస్తరించింది. 'అమెజాన్ డయాగ్నోస్టిక్స్' పేరుతో హోమ్ సర్వీస్ సేవలను ఆదివారం ప్రారంభించింది. వినియోగదారులు ఆరోగ్య పరీక్షల కోసం అమెజాన్ యాప్‌లో బుక్ చేసుకుంటే ల్యాబ్ టెక్నీషియన్లు ఇంటికే వచ్చి రక్తం లేదా ఇతర శాంపిల్స్‌ను తీసుకునేలా ల్యాబ్ టెస్టుల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆరెంజ్ హెల్త్ ల్యాబ్స్ భాగస్వామ్యంతో అమెజాన్ ఈ సేవలను ప్రారంభించింది. అమెజాన్ డయాగ్నోస్టిక్స్‌తో 800కి పైగా ఆరోగ్య పరీక్షలకు బుకింగ్స్, అపాయింట్‌మెంట్స్‌తో పాటు డిజిటల్ ఫార్మాట్‌లో రిపోర్టులను పొందే సదుపాయాన్ని కల్పిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ సహా ముంబై, బెంగళూరు, ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా సహా 450కి పైగా పిన్‌కోడ్స్ పరిధిలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని అమెజాన్ తెలిపింది.

# చంపేస్తామంటూ ఎంపీ రఘునందన్ రావుకు బెదిరింపు కాల్

◆ మావోయిస్టులమంటూ ఆగంతుకుడి బెదిరింపు
◆ మధ్యప్రదేశ్ నుంచి కాల్ చేస్తున్నట్లు తెలిపిన వ్యక్తి
◆ డీజీపీ, ఎస్పీలకు రఘునందన్ రావు ఫిర్యాదు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)



మెదక్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ నేత రఘునందన్ రావుకు సోమవారం బెదిరింపు కాల్ రావడం సంచలనం కలిగించింది. మావోయిస్టుల పేరుతో ఒక గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి, ఆయన్ను అదే రోజు సాయంత్రంలోగా హతమారుస్తామని హెచ్చరించాడు. ఈ ఘటనపై రఘునందన్ రావు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), మెదక్ ఎస్పీతో సహా ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రఘునందన్ రావు సోమవారం మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలోని ఒక పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సమయంలోనే ఆయనకు బెదిరింపు కాల్ వచ్చింది. మధ్యప్రదేశ్ నుంచి ఫోన్ చేస్తున్నానని, మావోయిస్టునని పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి, రఘునందన్ రావును సాయంత్రంలోగా చంపేస్తామని బెదిరించాడు.




# జనాభా లెక్కల్లో ఆదివాసీలకు ప్రత్యేక మతం కాలమ్ కేటాయించాలి

ఆదివాసీల ప్రత్యేక మతం గా గుర్తించాలి
టీఏజీఎస్ రాష్ట్ర కమిటి

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

కేంద్రం 2027లో చేపట్టనున్న జన గణన, కుల గణన లో ఆదివాసీలకు ప్రత్యేక మతం కాలం కేటాయించాలని ఆదివాసీల సంస్కృతి, భాష, వైవిధ్య భరితమైన జీవన విధానం కలిగిన ఆదివాసీల ప్రత్యేక మతం గుర్తింపును గెజిట్ లో పొందు పర్చాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది సోమవారం హైదరాబాద్ లో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడారు. ఆదివాసీల అనేక సంవత్సరాలనుండి వారికి జన గణన లో ప్రత్యేక మత కాలమ్ కేటాయించాలని పోరాడుతున్న వారికి ప్రత్యేక మతం గుర్తింపును అందించాలని రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుంది. ఐదవ మరియు ఆరవ షెడ్యూల్లలో ఆదివాసీల ల నమ్మకాలు, ఆచారాలు మరియు సంప్రదాయాల రక్షణ కోసం రాజ్యాంగంలో నిర్దిష్టమైన నిబంధనలు ఉన్నాయి. ఆర్టికల్ 371%A% మరియు 371%D% లకు అదనంగా నాగాలాండ్ మరియు అస్సాంలలో చట్టాలు, ఆచారాలకు నిర్దిష్ట రక్షణలు ఉన్నాయి.

ఆర్టికల్ (25) విశ్వాసాన్ని ప్రకటించే, ఆచరించే మరియు ప్రచారం చేసే హక్కును కల్పిస్తుంది. ఆర్టికల్ 26 మతపరమైన వ్యవహారాలను నిర్వహించే హక్కును ఇస్తుంది. ఈ హక్కులు జనాభా లెక్కలతో సహా ప్రతి సాధారణ చట్టపరమైన విధాన పరిధిలో ప్రకృతి ఆరాధన, పూర్వీకుల సంప్రదాయాలపై కేంద్రీకృతమై ఉన్న విభిన్న విశ్వాసఆధారిత నమ్మకాల గుర్తింపుగా ఆదివాసీలు కల్గి ఉన్నారు. కానీ ప్రభుత్వాలు పైన ఆరు మతాలకు మాత్రమే కాలమ్స్ కేటాయించడం తో ఆదివాసీల గుర్తింపును ప్రత్యామ్నాయం లేక స్వీకరిస్తున్నారు. కావునా 2027 జనాభా గణన లో ప్రత్యేక కాలామ్ కేటాయించి ఆదివాసీల ప్రత్యేక కోడ్ కేటాయించాలి.రాష్ట్ర వ్యాప్తంగా పోడు సాగు చేస్తున్న ఆదివాసీలు, గిరిజనేతర పేదలపై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. పోడు పట్టాలకు బ్యాంకు నుండి రుణాలు అందించాలని డిమాండ్ చేసారు.

# జాక్ పాట్ కొట్టిన మోదీ సర్కార్...

(తెలంగాణ ముచ్చట్లు)



కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జాక్ పాట్ కొట్టిందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంతకాలం పెట్రోల్ డీజిల్ ధరలు వంద రూపాయలు దాటిపోయాయి అని బాధపడుతున్నాం. కానీ వాటి ధరలు అతి త్వరలోనే సగంలో సగం పడిపోయే అవకాశం ఏర్పడిరది. అతి త్వరలోనే సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి ఇకపై ఆయిల్ దిగుమతులు భారీగా తగ్గించుకునే అవకాశం ఏర్పడిరది దానికి గల కారణాలు ఏంటో అందుకు దారి తీసిన పరిణామాలు ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ఇన్నాళ్లు ఆయిల్ రిజర్వ్స్ పైన గల్ఫ్ దేశాలపై ఆధారపడిన భారత్ ఇప్పుడు జాక్ పాట్ కొట్టిందా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంద. ముఖ్యంగా ఆయిల్ రిజర్వ్స్ విషయంలో అతి పెద్ద జాక్ పాట్ కొట్టబోతుంది. ఇది గనక అధికారికంగా ప్రకటన చేసేందుకు కొంత సమయం పడుతుందని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఇటీవల చేసినటువంటి ఒక ప్రకటన సంచలనం రేకెత్తిస్తుంది. భారతదేశానికి సంబంధించి అతి పెద్ద ఆయిల్ రిజర్వ్ చమురు నిక్షేపాలు అండమాన్ తీరంలో కనుగొన్నట్టుగా ఆయన చెప్తున్నారు. ఇక్కడ దాదాపుగా ఒక రోజుకి 11 మిలియన్ బ్యాలర్ల బ్యారల్స్ వెలికి తీసేటువంటి అవకాశం ఉన్నటువంటి అతి పెద్ద రిజర్వ్ అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు మన దేశం చేసుకుంటున్న ఆయిల్ దిగుమతులపైన 25% రిలీఫ్ దొరికేటువంటి అవకాశం ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అసలు ఈ ఆయిల్ రిజర్వ్ ఎక్కడ ఉందో తెలుసకుందాం. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేసినటువంటి ఒక ప్రకటన ఇప్పుడు అందరినీ కూడా ఆశ్చర్యానికి గురి చేస్తుంది. అండమాన్ సమీపంలో భారీ ఆయిల్ రిజర్వ్ నిక్షేపాల ఉన్నట్లు సైంటిస్టులు కనుగొన్నారు. ఇది లేటెస్ట్ గా 2015లో కనుగొన్న అతి పెద్ద చమురు నిక్షేపం గయానాతో పోల్చుతున్నారు. గయానా ఆయిల్ రిజర్వ్ ప్రపంచంలోనే 17వ అతి పెద్ద చమురు నిక్షేపం ఇక్కడ 17 బిలియన్ బ్యారెల్స్ పెట్రోలియం నిక్షేపాల ఉన్నట్టుగా చెప్తున్నారు. దక్షిణ అమెరికాలో కీలకమైన అట్లాంటిక్ సముద్ర తీరంలో ఉంటున్న దీవి ఈ గయానా. ఇది కరేబియన్ ఐలాండ్స్ లో ఒకటిగా ఉంది. గయానాలో ఉన్న చమురును బయటకు తీస్తే ఆ దేశం ప్రపంచంలోనే రిచెస్ట్ కంట్రీస్ లో ఒకటిగా మారబోతుందని ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. ఇప్పుడు అదే తరహాలో అండమాన్ ఐలాండ్స్ ఉన్న సముద్రంలో అతి పెద్ద ఆయిల్ రిజర్వ్ ఉన్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నానరు. ఈ ప్రకటన చేసింది కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి కావడంతో ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. గతంలో ఆయన ఓఎన్‌జీసీ లాంటి సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉంది. అంతేకాదు కృష్ణ గోదావరి బేసిన్ గ్యాస్ రిజర్వ్స్ ని కనుగొన్న టీంలో ఆయన ఒక కీలక పాత్రదారి. కేంద్ర పెట్రోలియం శాఖ గత 10ఏళ్లుగా దేశవ్యాప్తంగా చమురు నిక్షేపాల పైన పెద్ద ఎత్తున అన్వేషణలు చేస్తుంది. ఇతర ప్రైవేట్ సంస్థలతో కూడా కలిసి ఈ కొలాబరేషన్స్ అన్వేషణలు జరుపుతోంది. అండమాన్ లో చెమురు నిక్షేపాలను కనుగొనేందుకు ఓఎన్జిసి ఇప్పటికే 37 వేల కోట్ల రూపాయల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ అతి త్వరలోనే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే అవసరం తగ్గిపోయే అవకాశం ఉంది. అలాగే పెట్రోల్ డీజిల్ ధరలు కూడా భారీగా తగ్గడం గమనించవచ్చు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పవచ్చు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఇరాన్‌పై అమెరికా దాడి తర్వాత ప్రతిపక్షాల తీవ్ర వ్యతిరేకత

- ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్
- ట్రంప్ చర్యలు శాంతికి విరుద్ధమంటున్న విపక్ష నేతలు
- షరీఫ్ ప్రభుత్వంపై అన్నివైపుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 2026 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ పాకిస్థాన్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన ప్రస్తుతం ఆ దేశంలో వివాదాస్పదంగా మారింది. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో, ట్రంప్‌కు నోబెల్ పురస్కారం ఇవ్వాలన్న నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించాలని పాకిస్థాన్‌లోని ప్రతిపక్షాలు షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్యతో పాకిస్థాన్ ప్రభుత్వం అంతర్జాతీయంగా నవ్వులపాలైందని ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు. డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి పురస్కారానికి పాకిస్థాన్ నామినేట్ చేసిన మరుసటి రోజే ఆయన ఇరాన్‌పై దాడులకు ఆదేశించడం చర్చనీయాంశమైంది. పలు దేశాలు ట్రంప్ చర్యలను తీవ్రంగా ఖండిరచాయి. ఈ పరిణామం పాకిస్థాన్ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ప్రతిపక్షమైన పాకిస్థాన్ తెహ్రీక్‌ఇఇన్సాఫ్ (పీటీఐ) పార్టీకి చెందిన శాసనసభ్యుడు అలీ ముహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్‌ఇరాన్ వివాదంలో తమ దేశం ఇరాన్‌కే మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఇరాన్‌పై దాడులకు పాల్పడిన వ్యక్తికి నోబెల్ బహుమతి ప్రతిపాదించడం ద్వారా ట్రంప్, పాకిస్థాన్ ప్రభుత్వాన్ని సిగ్గుపడేలా చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షరీఫ్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పాకిస్థాన్‌లోని ప్రముఖ రాజకీయ నాయకుడు, జమియత్ ఉలేమాఇఇస్లాం (జేయూఐఎఫ్) పార్టీ అధినేత మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ కూడా ఈ విషయంపై తీవ్రంగా స్పందించారు. పాక్ మాజీ సెనేటర్ ముషాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ, ట్రంప్ శాంతి కోసం పాటుపడే నాయకుడు కాదని, ఉద్దేశపూర్వకంగానే ఆయన పలు యుద్ధాలకు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. అన్ని దేశాలను నాశనం చేయాలనే ఆలోచనతో ట్రంప్, అమెరికా పతనానికి అధ్యక్షత వహిస్తున్నారని దుయ్యబట్టారు. రక్తంతో తడిసిన ఆయన చేతులకు శాంతి బహుమతిని అందుకునే అర్హత లేదని ముషాహిద్ హుస్సేన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతికాముకుడు కాదని, ఆయన చర్యలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. పాలస్తీనా, సిరియా, లెబనాన్, ఇరాన్‌లపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు మద్దతు ఇస్తున్న ట్రంప్ ఎలా శాంతిదూత అవుతారని ఆయన ప్రశ్నించారు. పాక్ ఆర్మీ చీఫ్ (సీఓఏఎస్) అసిమ్ మునీర్‌తో ట్రంప్ సమావేశం కావడం, ఆయనకు విందు ఇవ్వడం వల్లే పాక్ ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసి ఉండవచ్చని రెహ్మాన్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కూడా డిమాండ్ చేశారు.

## క్రూడాయిల్ ను ఇరాన్ ఆపేస్తే భారత్‌కి ఇబ్బంది లేదు

**కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ కీలక ప్రకటన**



ఇరాన్ యుద్ధంలోకి అమెరికా ఎంట్రీ కావడం గేమ్‌ఛేంజర్ అవుతుందా? దాడులు చేసిన తర్వాత, ట్రంప్ శాంతిమంత్రం జపించినా, అంతా కూల్ అవుతుందా? ప్రపంచం మీద ఇరాన్ కొత్తగా దాడులు చేయాల్సిన అవసరం లేదు. క్రూడాయిల్ సరఫరా ఆపేస్తామంటే చాలు, మనం హడలిపోతాం.. ఎందుకంటే, క్రూడాయిల్ సరఫరాను ఇరాన్ ఆపేస్తే, అంతర్జాతీయంగా సమస్య వస్తుంది. ఒకవైపు హోర్ముజ్ జలసంధి మార్గం మూసివేత.. మరోవైపు క్రూడాయిల్ నిలిపివేతతో.. ధరలు అమాంతం పెరిగితే, మనదేశంలోనూ ధరలు పెరుగుతాయనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక ప్రకటన చేశారు. మొత్తంగా.. పశ్చిమాసియా ఘర్షణలతో ముడిచమురు గండం ఏర్పడిరది. అమెరికా దాడులతో క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి.. 78 డాలర్లకు పైగా బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ట్రేడవుతోంది.. అయితే.. చమురు ధరలు పెరిగితే సామాన్యుడిపై భారం తప్పదని పేర్కొంటున్నారు. ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధం, ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడులతో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌కు చమురు సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదన్నారు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి భయాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. దేశంలోని చమురు కంపెనీల దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయని, వివిధ మార్గాల ద్వారా ఇంధన సరఫరాలు నిరంతరాయంగా అందుతున్నాయన్నారు కేంద్రమంత్రి. హోర్ముజ్ మార్గం బంద్‌ఐనా భారత్‌కి ఇబ్బంది లేదు.. వేరే మార్గాల్లో భారత్‌కు క్రూడాయిల్ వస్తుంది.. 2 మిలియన్ బారెళ్లలోపే హోర్ముజ్ గుండా దిగుమతి చేసుకుంటాం.. భారత్‌కు వేరే మార్గాలనుంచి 4 మిలియన్ బారెళ్ల క్రూడాయిల్ వస్తుంది. మన కంపెనీల దగ్గర మూడువారాల నిల్వలు ఉన్నాయి.. ఇతర మార్గాల్లో క్రూడాయిల్ దిగుమతిపై దృష్టి పెడతాం అంటూ కేంద్రమంత్రి పేర్కొన్నారు.

## గుజరాత్‌లో బీజేపీ, ఆప్‌కు చెరో సీటు, కేరళలో కాంగ్రెస్ గెలుపు

**న్యూఢిల్లీ**

నాలుగు రాష్ట్రాల్లోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 19న జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఫలితాలు వెలువడుతున్నాయి. గుజరాత్, పంజాబ్, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. తాజా ఫలితాల ప్రకారం, గుజరాత్ లో బీజేపీ ఒక స్థానంలోనూ, ఆమ్ ఆద్మీ పార్టీ ఒక స్థానంలో గెలుపు సాధించాయి. కేరళలోని నిలాంబర్ సీటును కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పంజాబ్‌లోని లూథియానా వెస్ట్‌లోనూ ఆప్ పాగా వేసింది. ఆప్ అభ్యర్థి సంజీవ్ ఆరోరా 10,637 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు పశ్చిమబెంగాల్‌లోని కలిగంజ్‌లో తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతానికి 29,000 ఆధిక్యంలో కొనసాగుతూ గెలుపును ఖాయం చేసుకుంది. గుజరాత్‌లోని కడీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి రాజేంద్ర చావ్డా 39,452 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఆయనకు మొత్తం 99,742 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి రమేష్‌భాయ్ చావ్డా కేవలం 60,290 ఓట్లతో ఓటమి పోలయ్యారు. ఆప్ అభ్యర్థి జగదీష్ భాయ్ గణపత్‌భాయ్ చావ్డాకు 3,090 ఓట్లు పోలయ్యాయి. కాగా, బీజేపీకి కంచుకోటలా ఉన్న విసావదర్ నియోజకవర్గాన్ని ఆప్ కైవసం చేసుకుంది. ఆప్ అభ్యర్థి గోపాల్ ఇటాలియా 17,554 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు. గోపాల్ ఇలియాకు 75,943 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి కిరీత్ పాటిల్‌కు 58,388 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి నితిన్ రాన్‌పరయకు కేవలం 5,501 ఓట్లు పోలయ్యాయి. కేరళలోని నిలాంబర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్యదన్ షౌకత్ 11,000 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) అభ్యర్థి ఎం.సర్వాజ్‌పై 11,077 ఓట్ల ఆధిక్యంతో షౌకత్ గెలిచారు. షౌకత్‌కు 77,737 ఓట్లు రాగా, స్వరాజ్ (సీపీఎం)కు 66,660 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి పీవీ అన్వర్‌కు 19,760 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అడ్వకేట్ మోహన్ జార్జికి 8,648 ఓట్లు వచ్చాయి. పంజాబ్‌లోని లూథియానా వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి సంజీవ్ అరోరా 10,637 ఓట్ల ఆధిక్యంతో గెలుపు సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ ఆషుపై ఆయన విజయం సాధించారు. అటు గుజరాత్‌లోని విసావదర్‌లోనూ ఆప్ అభ్యర్థి గెలవడంతో ఆ పార్టీ సంబరాలు జరుపుకొంటోంది.


## యుద్ధంలో కనిపించకుండా పోయిన భారతీయుడు

- ఇరాన్‌లో బీహార్‌కు చెందిన ఇంజనీర్ సిరాజ్ అదృశ్యం
- జూన్ 17 నుంచి సిరాజ్‌తో ఎలాంటి కాంటాక్ట్ లేదన్న తండ్రి
- కొడుకును సురక్షితంగా తీసుకురావాలని తండ్రి ఆవేదన



ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, బీహార్‌కు చెందిన యువ ఇంజనీర్ ఒకరు ఇరాన్‌లో అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. సివాన్ జిల్లా, ముఫఫసిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రమాపాలి గ్రామానికి చెందిన సిరాజ్ అలీ అన్సారీ (25) ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సిరాజ్ ఒక పెట్రోలియం కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా, ప్రస్తుతం ఇరాన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సిరాజ్ తండ్రి హజరత్ అలీ తెలిపిన వివరాల ప్రకారం, సిరాజ్ సౌదీ అరేబియా మీదుగా జూన్ 9న ఇరాన్ చేరుకున్నారు. అయితే, అతడు అక్కడికి వెళ్లిన కొన్ని రోజులకే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమై ఘర్షణ వాతావరణం నెలకొంది. సిరాజ్‌తో చివరిసారిగా జూన్ 17న మధ్యాహ్నం 2 గంటల సమయంలో మాట్లాడినట్లు హజరత్ అలీ చెప్పారు. అప్పటి నుంచి సిరాజ్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందని, ఆయన నుంచి ఎలాంటి సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'చివరిసారి మాట్లాడినప్పుడు, తాను సురక్షితంగానే ఉన్నానని, కానీ తాను ఉంటున్న ప్రదేశానికి కేవలం కిలోమీటరు దూరంలో బాంబు దాడులు జరుగుతున్నాయని సిరాజ్ చెప్పాడు'' అని హజరత్ అలీ గుర్తుచేసుకున్నారు. ''ఆ రోజు నుంచి వాడి దగ్గర నుంచి ఎలాంటి కబురు లేదు. మాకు చాలా ఆందోళనగా ఉంది'' అని ఆయన కన్నీటిపర్యంతమయ్యారు.

సిరాజ్ అదృశ్యంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, సివాన్ జిల్లా మేజిస్ట్రేట్ ఆదిత్య ప్రకాశ్ కు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. సిరాజ్‌ను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు కోరారు.



## రైల్వేలో భారీగా ఉద్యోగాలకు నోటిఫికేషన్

రైల్వేలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ఇండియన్ రైల్వే గుడ్‌న్యూస్ చెప్పింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్నీ రైల్వే రీజియన్లలో భారీగా కొలువుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే శాఖకు చెందిన రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు.. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేస్తుంది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 6,180 టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయనుంది. మొత్తం పోస్టుల్లో టెక్నీషియన్ గ్రేడ్ సిగ్నల్ పోస్టులు 180, టెక్నీషియన్ గ్రేడ్‌పోస్టులు 6,000 వరకు ఉన్నాయి. అందిన సమాచారం మేరకు జూన్ 28వ తేదీన నోటిఫికేషన్ విడుదలకానుంది. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 28వ తేదీ నుంచే ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలు ఈ కింద చెక్ చేసుకోండి.. సికింద్రాబాద్ సహా.. అహ్మదాబాద్, అజ్‌మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.. ఆర్‌ఆర్‌బీ రీజియన్లలో టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయనుంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జులై 28, 2025వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో జారీ అయిన షార్ట్ నోటిఫికేషన్ ప్రకారం.. 2025, జులై 1 నాటికి గ్రేడ్ 1 అభ్యర్థులకు వయోపరిమితి 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. గ్రేడ్ 3 అభ్యర్థులకు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అయితే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఉండవల్సిన అర్హతలు, వయోపరిమితితోపాటు ఎంపిక ప్రక్రియ, దరఖాస్తు ఫీజు వంటి తదితర వివరాలు త్వరలోనే విడుదలయ్యే వివరణాత్మక నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోవచ్చు. అలాగే రీజియన్ల వారీ ఖాళీలు, విద్యార్హత, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలు అందులోనే ఉంటాయి.

## ఇరాన్ ఫోర్డో అణు కేంద్రానికి తీవ్ర నష్టం


- ఇరాన్ ఫోర్డో అణు కేంద్రంపై అమెరికా వైమానిక దాడులు
- కేంద్రానికి తీవ్ర నష్టం వాటిల్లి ఉంటుందని ఐఏఈఏ అంచనా
- వియన్నాలో ఐఏఈఏ అధిపతి రఫెల్ గ్రోస్సీ సోమవారం ప్రకటన



ఇరాన్‌లోని ఫోర్డో భూగర్భ అణు కేంద్రంపై అమెరికా జరిపిన వైమానిక దాడిలో తీవ్రమైన నష్టం వాటిల్లి ఉంటుందని ఐక్యరాజ్య సమితి అణు పర్యవేక్షక సంస్థ అధిపతి రఫెల్ మరియానో గ్రోస్సీ వెల్లడిరచారు. అత్యాధునిక బంకర్‌బస్టర్ బాంబులను ఈ దాడిలో ఉపయోగించినట్లు ఆయన తెలిపారు. వియన్నాలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) అధిపతి గ్రోస్సీ మాట్లాడుతూ, ''దాడిలో ఉపయోగించిన పేలుడు పదార్థాల మోతాదు, అలాగే సెంట్రిఫ్యూజ్‌లు అత్యంత సున్నితంగా కంపనాలకు ప్రతిస్పందించే స్వభావం కలిగి ఉండటం వల్ల చాలా గణనీయమైన నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నాం'' అని వివరించారు. ఫోర్డో అణు కేంద్రం ఇరాన్ కీలకమైన యురేనియం శుద్ధి కేంద్రాలలో ఒకటిగా పేరు పొందింది. అయితే, ఫోర్డోలోని భూగర్భంలో జరిగిన నష్టాన్ని పూర్తిగా అంచనా వేయగల స్థితిలో ప్రస్తుతం ఐఏఈఏతో సహా మరెవరూ లేరని మిస్టర్ గ్రోస్సీ స్పష్టం చేశారు. ''ఈ సమయంలో, ఫోర్డోలోని భూగర్భ నష్టాన్ని పూర్తిగా అంచనా వేయడానికి ఐఏఈఏతో సహా ఎవరి వద్దా కచ్చితమైన సమాచారం లేదు'' అని ఆయన అన్నారు. దాడి జరిగిన ప్రదేశానికి తక్షణమే ప్రవేశం లభించే అవకాశాలు తక్కువగా ఉండటంతో, నష్టంపై పూర్తి స్పష్టత రావడానికి కొంత సమయం పట్టవచ్చని తెలుస్తోంది.

## ఇరు దేశాల మధ్య మరింత పెరిగిన ఉద్రిక్తతలు

- ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడుల మోత
- 6 ఎయిర్‌పోర్టులపై దాడులు, 15 విమానాలు ధ్వంసం
- గగనతలంలో ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్ తీవ్ర దాడులు



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఇరాన్ గగనతలంలో తమ ఆధిపత్యాన్ని మరింతగా పెంచుకునే దిశగా కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇరాన్‌లోని ఆరు విమానాశ్రయాలపై దాడులు చేసి, 15 సైనిక విమానాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ అధికారికంగా ప్రకటించింది. ఈ పరిణామం పశ్చిమాసియాలో ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను మరింత ఆందోళనకరంగా మార్చింది. ఐడీఎఫ్ 'ఎక్స్' వేదికగా ఈ దాడి వివరాలను వెల్లడిరచింది. ''ఇరాన్ గగనతలంలో వైమానిక ఆధిపత్యాన్ని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా, పశ్చిమ, తూర్పు, మధ్య ఇరాన్‌లోని ఆరు ఇరాన్ ప్రభుత్వ విమానాశ్రయాలపై ఐడీఎఫ్ దాడి చేసింది. ఈ దాడుల్లో రన్‌వేలు, భూగర్భ బంకర్లు, ఒక రీఫ్యూయెలింగ్ విమానం, మరియు ఇరాన్ ప్రభుత్వానికి చెందిన ఎఫ్ 14, ఎఫ్5, మరియు ఏహెచ్1 విమానాలు ధ్వంసమయ్యాయి'' అని ఐడీఎఫ్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో రిమోట్‌గా నడిచే మానవరహిత విమానాలను (డ్రోన్లు) ఉపయోగించినట్లు పేర్కొంది. ఇరాన్ భూభాగంలో ఇజ్రాయెల్ దాడులను అడ్డుకోవడానికి ఉద్దేశించిన విమానాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ స్పష్టం చేసింది. ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య ఘర్షణ నేటితో 11వ రోజుకు చేరుకుంది. జూన్ 13న ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్ అణు మౌలిక సదుపాయాలు, సైనిక స్థావరాలు, సీనియర్ కమాండర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు ప్రారంభించడంతో ఈ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దీనికి ప్రతిగా, ఇరాన్ 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 3' పేరుతో ఇజ్రాయెల్ లక్ష్యాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడుల వల్ల సదరు విమానాశ్రయాల నుంచి విమానాలు టేకాఫ్ అయ్యే సామర్థ్యం దెబ్బతిన్నదని, ఇరాన్ సైన్యానికి చెందిన వైమానిక శక్తి కార్యకలాపాలకు అంతరాయం కలిగిందని కూడా వారు జోడిరచారు. మరోవైపు, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నిన్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో తమ లక్ష్యాలను సాధించడానికి ఇజ్రాయెల్ చాలా దగ్గరగా ఉందని, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి, అణు కేంద్రాలకు ఇప్పటికే గణనీయమైన నష్టం కలిగించామని ఆయన పేర్కొన్నారు. టెహ్రాన్‌తో సుదీర్ఘకాలం పోరాటంలో ఇజ్రాయెల్‌ను లాగడానికి తాను ఇష్టపడనని నెతన్యాహు స్పష్టం చేశారు. ''లక్ష్యాలను సాధించడానికి అవసరమైన దానికంటే ఎక్కువగా మా చర్యలను కొనసాగించబోము, అలాగని ఇప్పటికిప్పుడే ముగించం'' అని ఆయన అన్నారు. విలేకరులతో మాట్లాడుతూ, ''లక్ష్యాలు సాధించినప్పుడు, ఆపరేషన్ పూర్తవుతుంది మరియు పోరాటం ఆగిపోతుంది'' అని నెతన్యాహు వివరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
మంగళవారం-24- జూన్ 2025





## దిల్ రాజు భార్యలో టాలెంట్ మాములుగా లేదు

ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన మొదటి భార్య అనిత అనారోగ్యంతో చనిపోవడంతో తేజస్విని అనే యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. అసలు పేరు వైఘారెడ్డి కాగా, ఇద్దరి జాతకాలను బట్టి పేరును మార్చారని అప్పట్లో వార్తలు వచ్చాయి. మొదటి భార్య అనిత మరణాంతరం ఆయన ఒంటరిగా ఉంటున్ననేపథ్యంలో అతనికి తోడుగా ఉండేందుకు జీవిత భాగస్వామి అవసరమని కుటుంబ సభ్యుల ఒత్తిడి చేయగా, ఆయన రెండో పెళ్లి చేసుకున్నారు. ఇప్పుడు ఈ దంపతులకి ఓ బుడతడు కూడా ఉన్నాడు. అయితే తేజస్విని సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో అప్పుడప్పుడు పోస్టులు షేర్ చేస్తూ ఉంటారు. ఇంతకు ముందు ఎక్కువగా భర్త దిల్ రాజు, తనయుడు అన్వి రెడ్డితో కలిసి దిగిన ఫోటోలు లేదా వీడియోలు షేర్ చేసేది. కానీ ఇటీవలి కాలంలో ఆవిడ పర్సనల్ ఫోటోలు ఎక్కువగా షేర్ చేస్తున్నారు. అలాగే భర్తతో కలిసి ఫారిన్ వెకేషన్ వెళ్ళినప్పుడు సైతం అక్కడ తీసుకున్న ఫోటోలు వీడియోలు షేర్ చేస్తూ నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తుంది. గతేడాది ఇంత ఎక్కువగా సోషల్ మీడియాలో పోస్టులు చేయని తేజస్విని ఈ మధ్య మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. శనివారం జూన్ 21 న ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా దేశమంతా ఘనంగా యోగా డే సెలబ్రేట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనేకమంది సెలబ్రిటీలు యోగాసనాలు వేసి ఆ ఫోటోలను తమ సోషల్ మీడియాలో షేర్ చేసారు. ఈ నేపథ్యంలో దిల్ రాజు భార్య తేజస్విని కూడా యోగా డే సందర్భంగా ప్రత్యేకమైన వీడయో షేర్ చేసింది. ఇందులో పలు రకాల యోగాసనాలు చేస్తూ వాటికి సంబంధించిన పేర్లని కూడా పొందుపరిచింది. ఇది చూసిన వారు దిల్ రాజు భార్యలో ఇంత టాలెంట్ ఉందా అని నోరెళ్లపెడుతున్నారు. ప్రస్తుతం అయితే దిల్ రాజు భార్య తేజస్విని వీడియో సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తుంది.

## ఆ డైరెక్టర్ అంటే చాలా ఇష్టం అంటున్న మాళవిక..

### ఒకే ఒక్క ఛాన్స్ ఇవ్వమంటున్న ముద్దుగుమ్మ



మాలవిక మోహనన్ ఇచ్చిన స్టేట్మెంట్ ఇప్పుడు ఇండస్ట్రీలో ఏమా స్పీడ్ గా వైరల్ అవుతుంది. అందులోనూ రాజమౌళి పేరు ప్రస్తావించడంతో క్షణాల్లో స్పీడ్ అయింది వార్త. ఇంతకీ ఈ హాట్ బ్యూటీ జక్కన్న గురించి ఏమన్నారో ?? ది రాజా సాబ్ కోసం ఎన్నాళ్లుగానో వెయిట్ చేస్తున్నారు మాలవిక మోహనన్. నెక్స్ట్ లెవెల్ మూవీ అంటూ ఇప్పటికే పలు సందర్భాల్లో ప్రస్తావించారు. నెక్స్ట్ లెవెల్ మూవీ అంటూ ఇప్పటికే పలు సందర్భాల్లో ప్రస్తావించారు. రీసెంట్ గా రిలీజ్ అయిన టీజర్ లోను మాలవికకు మంచి సీన్స్ కనిపించాయి. టీజర్ లో జస్ట్ టీజ్ చేశారంతే పిక్చర్ అబ్బి బాకీ హై అంటున్నారు మాలవిక మోహనన్. నెక్స్ట్ లెవెల్ మూవీ అంటూ ఇప్పటికే పలు సందర్భాల్లో ప్రస్తావించారు. రీసెంట్ గా రిలీజ్ అయిన టీజర్ లోను మాలవికకు మంచి సీన్స్ కనిపించాయి. టీజర్ లో జస్ట్ టీజ్ చేశారంతే పిక్చర్ అబ్బి బాకీ హై అంటున్నారు మాలవిక మోహనన్. డార్లింగ్ తో పక్కా మాస్ మసాలా సాంగ్ లో స్టెప్పులు గ్యారెంటీగా ఉంటాయని చెబుతున్నారు. ది రాజా సాబ్ ఫ్యాన్స్ కి పండగలా ఉంటుందన్నది ఈ లేడీస్ తో ఇచ్చిన చిన్న హింట్ మాత్రమే. డార్లింగ్ తో పక్కా మాస్ మసాలా సాంగ్ లో స్టెప్పులు గ్యారెంటీగా ఉంటాయని చెబుతున్నారు. ది రాజా సాబ్ ఫ్యాన్స్ కి పండగలా ఉంటుందన్నది ఈ లేడీస్ తో ఇచ్చిన చిన్న హింట్ మాత్రమే. ది రాజా సాబ్ తర్వాత తెలుగులో తప్పక హల్ చల్ చేస్తాననే కాన్ఫిడెన్స్ కనిపిస్తోంది ఈ మల్లు బ్యూటీలో. అన్నట్టు తెలుగులో ఆమె ఫేవరెట్ డైరెక్టర్ రాజమౌళి అట. ది రాజా సాబ్ తర్వాత తెలుగులో తప్పక హల్ చల్ చేస్తాననే కాన్ఫిడెన్స్ కనిపిస్తోంది ఈ మల్లు బ్యూటీలో. అన్నట్టు తెలుగులో ఆమె ఫేవరెట్ డైరెక్టర్ రాజమౌళి అట.తప్పకుండా జక్కన్న తో ఒక సినిమా చేయాలని అనుకుంటున్నట్టు తెలిపారు మాలవిక. తెలుగులో ది రాజా సాబ్, తమిళంలో సర్దార్ 2, మలయాళంలో హృదయపూర్వంలో నటిస్తున్నారు మాలవిక మోహనన్. తప్పకుండా జక్కన్న తో ఒక సినిమా చేయాలని అనుకుంటున్నట్టు తెలిపారు మాలవిక. తెలుగులో ది రాజా సాబ్, తమిళంలో సర్దార్ 2, మలయాళంలో హృదయపూర్వంలో నటిస్తున్నారు మాలవిక మోహనన్. త్వరలోనే ది రాజా సాబ్ ప్రమోషనల్ ఈవెంట్స్ లో సందడి చేయడానికి ప్రిపేర్ అవుతున్నానన్నారు. ఈ ఏడాది హిట్ గ్యారెంటీ అనే కాన్ఫిడెన్స్ కనిపిస్తోంది. త్వరలోనే ది రాజా సాబ్ ప్రమోషనల్ ఈవెంట్స్ లో సందడి చేయడానికి ప్రిపేర్ అవుతున్నానన్నారు. ఈ ఏడాది హిట్ గ్యారెంటీ అనే కాన్ఫిడెన్స్ కనిపిస్తోంది.

## పవన్ కళ్యాణ్ ధరించిన చెప్పుల ధర ఎంతో తెలుసా?

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకవైపు సినిమాలు, మరోవైపు రాజకీయాలతో బిజీ బిజీగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం హరీష్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్‌లో పాల్గొంటూనే మధ్య మధ్యలో పలు రాజకీయ కార్యక్రమాలకి హాజరు అవుతున్నారు. ఇటీవల యోగాంధ్ర కార్యక్రమానికి హాజరైన పవన్ రీసెంట్‌గా మదురైలో జరిగిన మురుగన్ భక్తుల సదస్సులో పాల్గొని ఉజ్వలమైన ప్రసంగం చేశారు. ‘‘మురుగన్ నామస్మరణతో ఏ శత్రువైనా పారిపోతాడు’’ అనే ఆశయాన్ని ప్రతిపాదిస్తూ ధర్మం మార్గంలో ముందుకెళ్లాలంటూ పిలుపునిచ్చారు. వీరవేల్ మురుగన్ పై ఆత్మ విశ్వాసంతో విజయాన్ని సాధించవచ్చని చెప్పారు. అయితే పవన్ కళ్యాణ్ లుక్ ఇటీవల చర్చనీయాంశంగా మారింది. ఆ మధ్య కుంభమేళాకి వెళ్లిన సమయంలో పవన్ లుక్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. కాని కొద్ది రోజుల నుండి పవన్ చాలా హ్యాండ్సమ్‌గా కనిపిస్తున్నాడు. పవన్ బరువు కూడా తగ్గడంతో ఆయన లుక్ అందరిని ఆకట్టుకుంటుంది. అయితే పవన్ కళ్యాణ్ తాజాగా వైట్ అండ్ వైట్ పంచె, షర్ట్, బ్లాక్ గాగుల్స్ ధరించి విమానం దిగి నడుచుకుంటూ వస్తుండగా, ఆయన స్వాగ్ చూసి పవన్ అభిమానులు పిచ్చెక్కిపోతున్నారు. ఏమున్నాడురా బాబు అంటూ నెటిజన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మరోవైపు పవన్ ఇదే సమయంలో ధరించిన చెప్పులు అందరి దృష్టిని ఆకర్షించాయి. చూడడానికి చాలా స్పెషల్‌గా ఉన్న ఈ చెప్పులు నిక్ కామ్ బ్రాండ్



కు చెందినవి.వీటి ధర రూ. 7 వేలు. ఈ ధర చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఒక స్టార్ హీరో, డిప్యూటీ సీఎం అయిన పవన్ ఈ మాత్రం ధర ఉన్న చెప్పులు ధరించకపోతే ఎలా అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే, పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరీశ్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్ , సుజీత్ డైరెక్షన్‌లో సఓజీ చిత్రాల్లో నటిస్తున్నారు.ఈ రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. ఇక క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పవన్ నటించిన ‘హరి హర వీరమల్లు’ రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. ఈ సినిమాను జులై 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నారు.



## 15 నిమిషాలకే ప్రభాస్ గ్రాండ్ ఎంట్రీ.. సీన్ నెక్ష్ట్ లెవెల్

స్టార్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రూపొందిన చిత్రం ‘కన్నప్ప’. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ జూన్ 27న రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన ప్రమోషన్స్ జరుగుతున్నాయి. జూన్ 21న ఫిల్మ్ నగర్ జేఆర్‌సీ కన్వెన్క్షన్‌లో జరిగిన గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ ఈవెంట్‌లో ప్రభాస్ ఫ్యాన్స్‌లో జోష్ నింపే ఓ విషయాన్ని కన్నప్ప సినిమా రైటర్ బీవీఎస్ రవి స్టేజ్‌పై వెల్లడిరచారు. సినిమా ప్రభాస్ ఎంట్రీ ఎప్పుడు ఉండనుందో చెప్పేశారు. కన్నప్పలో రెబల్ స్టార్ ఎంట్రీ సెకండ్ హాఫ్‌లో ఉండనున్నట్లు చెప్పారు. ఇంటర్వెల్ తర్వాత పదిహేను నిమిషాల తరువాత ‘రుద్ర’ గా ప్రభాస్ ఎంట్రీ ఇస్తారని అన్నారు. ఆక్కడ్నుంచి దాదాపు ఇరవై నిమిషాల పాటు స్క్రీన్‌పై ప్రభాస్ తాండవం ఉంటుందని ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. ప్రభాస్ స్క్రీన్ పై వచ్చిన వెంటనే సినిమా నెక్ట్స్ లెవెల్‌కు వెళ్తుందని చెప్పారు. ఈ ఇరవై నిమిషాల్లో ప్రభాస్, విష్ణు, మోహన్‌బాబు సన్నివేశాలతో థియేటర్లు దద్దరిల్లుతాయని రవి పేర్కొన్నారు. ఇది విన్న ఫ్యాన్స్ ప్రభాస్ లుక్‌ను చూసేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ ఈ సినిమాలో నటుస్తున్నారని తెలిసి సీనిమా పై ఫ్యాన్స్ భారీ అంచనాలను పెంచుకున్నారు. థియేటర్ రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విష్ణు మాటల్లో ప్రభాస్ గురించి: స్నేహితులు రెండు రకాలు. ‘నీ పక్కనే ఉంటా. నీకు దారి చూపిస్తా’ అని కృష్ణుడు అంటే ‘నువ్వు ఏదైనా చేయ్. నీ వెనుక నేనుంటా. ఏం జరిగినా నేను చూసుకుంటా’ అని కర్ణుడు అంటాడు. నా జీవితంలో ప్రభాస్ కృష్ణుడులాంటి వాడు. అతడికి ఈ సినిమా చేయాల్సిన అవసరం లేదు. కానీ, మా నాన్నపై ఉన్న ప్రేమతో నటించాడు. ప్రభాస్ గురించి ఎంత చెప్పినా తక్కువే. మానవత్వం ఉన్న వ్యక్తి . ప్రభాస్ నుంచి ఈ తరం చాలా విషయాలు నేర్చుకోవాలి. డబ్బు, పేరు రాగానే కొందరు మారిపోతుంటారు. కానీ, ప్రపంచంలోనే బిగ్గెస్ట్ స్టార్‌గా ఎదిగినా ప్రభాస్ ఇప్పటికీ మారలేదు. ప్రభాస్ నీకు నేను కర్ణుడిలాంటి వాడిని. ఏం కావాలన్నా అడుగు. నీ వెనుక నేను ఉంటా మంచు విష్ణు.



## కావాలనుకొని హీరోయిన్ అయ్యింది! 11ఏళ్లుగా హిట్ లేకున్నా క్రేజ్‌లో తగ్గేదేలే!

టాపర్- కావలనుకొని నటి అయ్యింది- కెరీర్‌లో సరైన హిట్ లేకున్నా స్టార్ హోదాలోనే ఈ అమ్మడు! ఆ అమ్మాయి చదువులో బ్రిలియంట్. స్కూల్‌లో ఉత్తమ విద్యార్థి. ఇంటర్మీడియెట్‌లోనూ క్లాస్ టాపర్. ఫేమస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేట్ కూడా పూర్తి చేసింది. ఆ తర్వాత ఐఏఎస్ అవ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంది. ఈ దిశగా అడుగులు కూడా వేసింది. కానీ, అనుకోకుండా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. అదీనూ టాలీవుడ్‌తోనే తెరంగేట్రం చేసింది. అయితే 11ఏళ్లుగా పెద్ద హిట్ లేకపోయినా, తెలుగు ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్‌గానే కొనసాగుతోంది. ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరో కాదు రాశీ ఖన్నా

చదువులో టాపర్ : 1990 నవంబర్ 30న పుట్టిన రాశీ ఖన్నా, ఢిల్లీలో చదువుకుంది. శ్రీరామ్ కాలేజ్ నుంచి ఇంగ్లిష్ లిటరేచర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఓసారి ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశీ తన లక్ష్యం గురించి మాట్లాడిరది. “చదువులో నేను బెస్ట్. అసలు నటిగా మారాలన్న ఆలోచనే ఎప్పుడూ రాలేదు. ఐఏఎస్ కావాలని నిర్ణయించుకున్నప్పుడు, అదృష్టం మళ్ళీ ఇలా సినిమాలవైపు తీసుకెళ్లింది” అని చెప్పింది. తన గాత్రం వల్ల మొదటగా సింగర్ అవాలనుకున్న రాశీ చివరికి యాక్టింగ్‌లోకి రావడం ఇంట్రెస్టింగ్ పాయింట్.

అడ్వర్టైజింగ్ నుంచి మోడలింగ్? : రాశీ ఖన్నా మొదటగా ఒక అడ్వర్టైజింగ్ ఏజెన్సీలో కాపీరైటర్‌గా పనిచేసింది. అక్కడి నుంచి మోడలింగ్‌కు మారి ప్రముఖ బ్రాండ్‌లతో పని చేసింది. అదే సమయంలో దర్శకుడు శూజిత్ సిర్‌కార్ ఆమెను ‘మద్రాస్ కేఫే’ సినిమాలో జాన్ అబ్రహాంకి జోడీగా తీసుకున్నారు. ఆ సినిమా ద్వారా రాశీకి ఫస్ట్ బ్రేక్ వచ్చింది. స్క్రీన్‌పై తక్కువ టైమ్ ఉన్నా ఆమె పెర్ఫార్మెన్స్‌కు మంచి గుర్తింపు వచ్చింది.

తెలుగులో ఊహలు గుసగుసలాడే : ఆ తర్వాత రాశీ ఖన్నా తన సినీ ప్రయాణాన్ని దక్షిణాదిలో కొనసాగించింది. తెలుగులో ‘ఊహలు గుసగుసలాడే’తో తెరంగేట్రం చేసి, తమిళంలో ‘ఇమ్మాయికల్ నోదిగల్’, మలయాళంలో ‘విలన్’ సినిమాలతో ఎంట్రీ ఇచ్చింది. ఈ ప్రయాణంలో ఆమె చేసిన సినిమాలు ‘బెంగాల్ టైగర్’, ‘జై లవకుశ’, ‘సుప్రీమ్’, ‘తొలి ప్రేమ’, ‘వెంకీ మామా’, ‘ప్రతి రోజు పండగే’, ‘సర్దార్’, ‘రుద్ర’, ‘ఫర్జీ’. ప్రతీ సినిమాలో ఆమె స్టైల్, పెర్ఫార్మెన్స్ ఆకట్టుకున్నా భారీ హిట్ మాత్రం అందలేదు.

అయినా క్రేజ్ తగ్గలేదు: పది సంవత్సరాలు గడిచినా ఒక్క సాలిడ్ బ్లాక్‌బస్టర్ లేకపోయినా, రాశీ ఖన్నా పట్ల ప్రేక్షకుల్లో ఉన్న అభిమానం తగ్గలేదు. స్క్రీన్ మీద తన అందంతోనే కాదు, పాత్రలో ఒదిగిపోయే విధానంతో ప్రేక్షకులను మెప్పించింది. హిట్స్ లేని హీరోయిన్‌గా కాకుండా, కంటెంట్ బేస్డ్ కథల్లో తనదైన ముద్ర వేసే నటి గానే గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల కాలంలో వెబ్‌సిరీస్ ‘ఫర్జీ’లో విజయ్ సేతుపతితో చేసిన పాత్రకు మంచి రెస్పాన్స్ వచ్చింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లేపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# తనపై వచ్చిన విమర్శలపై బుమ్రా సంచలన కామెంట్స్

ఇంగ్లాండ్‌తో లీడ్స్‌లో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కీలక కామెంట్స్ చేశారు. గాయాల నుంచి కొలుకొని తిరిగి వచ్చిన తరువాత తనపై విమర్శలు చేసిన వారిపై ఘాటుగా స్పందించాడు. విమర్శలను తాను పట్టించుకోనని, దేవుడు రాసినంతకాలం క్రికెట్ ఆడతానని చెప్పాడు. పోస్ట్ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బూమ్రా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'వాళ్లు (విమర్శకులు) నా గురించి ఏం అంటారు, ఏం రాస్తారు అనే దానిపై నేను దృష్టి పెట్టను. నా లక్ష్యం ముఖ్యం. వాళ్లు నా పేరుని ఉపయోగించి హెడ్ లైన్స్ వేస్తారనే విషయం నాకు తెలుసు. కానీ అవి నా మైండ్‌లోకి రాకుండా చూసుకుంటాను. నాకు అలాంటి ఒత్తిళ్లు అవసరం లేదు. ప్రతిరోజూ నిద్రకు వెళ్లేముందు నేను నన్ను నేను ఓసారి ప్రశ్నించుకుంటాను. నేను నా వంద శాతం కష్టపడ్డానా అన్న ప్రశ్నకు అవునని సమాధానం వస్తే చాలు. నిశ్శబ్దంగా నిద్రపోతాను. ఇతరులు ఎలా ఆడమంటారో కాదు, నేను నమ్మిన విధంగానే ఆడతాను. నా ప్రిపరేషన్, నా ఆలోచనలు ఎప్పుడూ భారత్ కోసం ఆడాలనే తపనతోనే ఉంటాయి' అని బూమ్రా తెలిపారు. ''గాయం అయిన ప్రతిసారి, 'ఇంకా బుమ్రా ఆడడు', 'ఇంకా ఆటకి దూరం' అంటూ ఊహాగానాలు వచ్చాయి. అయినా గడిచిన దశాబ్దంగా నేను అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతూనే ఉన్నాను. 'ఇప్పుడు కూడా బుమ్రా రిటైర్ అవుతాడు' అని ఇంకా కొంతమంది అంటున్నారు. ఎదురు చూస్తూ ఉండండి. నేను నా పని చేస్తూనే ఉంటాను. దేవుడు రాసినంతకాలం ఆట కొనసాగిస్తాను,'' అని బుమ్రా స్పష్టం చేశాడు.

లీడ్స్‌లో బుమ్రా రికార్డులు లీడ్స్‌లో ఐదు వికెట్లను సాధించడం ద్వారా బుమ్రా రత దిగ్గజం కపిల్ దేవ్ సరసన చేరాడు. విదేశీ గడ్డపై ఆయన 12వ సారి 5వికెట్లు పడగొట్టడం ద్వారా ఈ ఘనత సాధించారు. అంతేకాకుండా సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో 150 టెస్టు వికెట్లు తీసిన మొదటి ఆసియా బౌలర్‌గా బుమ్రా రికార్డు సృష్టించాడు. ఇదిలా ఉండగా, లీడ్స్ లో మూడో రోజు భారత జట్టు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 90/2 వద్ద నిలిచింది. కేఎల్ రాహుల్ (47లి) అజేయంగా నిలిచాడు. శుభ్‌మన్ గిల్ (6లి) అతనితో పాటు క్రీజులో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 471 పరుగులు చేయగా, ఇంగ్లాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 465 పరుగులు చేసింది.

# ఆధిక్యం స్వల్పమే




ఐదు వికెట్లతో చెలొంగిన బుమ్ర ఫీల్డింగ్ వైఫల్యానికి తోడు బుమ్రా (5/83) మినహా ఇతర బౌలర్లు పెద్దగా రాణించకపోయినా... భారత్‌కు ఆరు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఊరట దక్కింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 90/2 స్కోరుతో ఆడుతోంది. క్రీజులో రాహుల్ (47), కెప్టెన్ గిల్ (6) ఉన్నారు. ఇప్పటికి 96 పరుగుల ఆధిక్యంలో ఉన్న భారత్‌కు నాలుగో రోజు ఆట కీలకం కానుంది. బ్యాటర్లు ఏ మేరకు క్రీజులో నిలుస్తారన్నదానిపై ఇంగ్లండ్ ఛేదన ఆధారపడి ఉంటుంది. గెలుపుపై ఆశలు పెట్టుకోవాలంటే కనీసం 300 లక్ష్యమైనా ఆతిథ్య జట్టు ముందుంచాలి. ఇక హ్యారీ బ్రూక్ (99) ఎదురుదాడికి టెయిలెండర్లు కూడా సహకరించడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 465 పరుగులు చేసింది. పోప్ (106), స్మిత్ (40), వోక్స్ (38) రాణించారు. బుమ్రాకు 5, ప్రసిద్‌ధ్‌కు 3, సిరాజ్‌కు 2 వికెట్లు పడ్డాయి. అయితే ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో భారత ఫీల్డర్లు మొత్తం ఐదు క్యాచ్‌లను వదిలేయగా ఇందులో బుమ్రా బౌలింగ్‌లోనివే నాలుగు ఉండడం గమనార్హం. జైస్వాల్ మూడిరటిని నేలపాలు చేశాడు.

**బ్రూక్ జోరు:** 209/3 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ బ్యాటర్లు దూకుడు ప్రదర్శించారు. తొలి సెషన్‌లో ఆకాశం మేఘావృతానికి తోడు గాలి ఎక్కువగానే వీచినా భారత పేసర్లు బంతిని స్వింగ్ చేయలేకపోయారు. దీనికి తోడు ఫీల్డింగ్ వైఫల్యం ప్రత్యర్థికి కలిసొచ్చింది. ముఖ్యంగా బ్రూక్ ఎదురుదాడికి తొలి సెషన్‌లో జట్టు 28 ఓవర్లలో 118 రన్స్ సాధించింది. అయితే సెంచరీ హీరో పోప్‌ను ఆరంభంలోనే ప్రసిద్ధ్ అవుట్ చేయగా.. కెప్టెన్ స్టోక్స్ (20)తో కలిసి బ్రూక్ ఐదో వికెట్‌కు 51 పరుగులు జత చేశాడు. కానీ బ్రూక్ 46 పరుగుల వద్ద ఉన్నప్పుడు పంత్ క్యాచ్ వదిలేశాడు.

**మరింత వేగంగా...:** రెండో సెషన్‌లో ఇంగ్లండ్ ఆటలో మరింత వేగం పెరిగింది. సిరాజ్, ప్రసిద్ధ్ ధారాళంగా రన్స్ ఇవ్వడంతో ఆ జట్టు 23.4 ఓవర్లలో 138 పరుగులు సాధించింది. పేసర్ బుమ్రా మాత్రం ఐదు వికెట్ల ఫీట్‌ను అందుకున్నాడు. లంచ్ బ్రేక్ తర్వాత సిక్సర్‌తో ఊపు మీదున్న స్మిత్‌ను పేసర్ ప్రసిద్ధ్ వెనక్కిపంపాడు. అయితే అప్పటికే ఆరో వికెట్‌కు బ్రూక్‌స్మిత్ జోడీ 73 పరుగులను జత చేయగలిగింది. ఆ తర్వాత కూడా బ్రూక్ జోరు తగ్గలేదు. 80 ఓవర్ల తర్వాత భారత్ రెండో కొత్త బంతిని తీసుకున్నా ఫలితం కనిపించలేదు. దీనికి తోడు బ్రూక్ 82 పరుగుల వద్ద ఉన్నప్పుడు స్లిప్‌లో జైస్వాల్ సులువైన క్యాచ్‌ను వదిలేశాడు. కానీ సెంచరీకి పరుగు దూరంలో ప్రసిద్ధ్ షార్ట్ పిచ్ బాల్‌కు బ్రూక్ క్యాచ్ అవుటయ్యాడు. చివర్లో టెయిలెండర్లతో కలిసి వోక్స్ చెలరేగాడు. అటు ఇంగ్లండ్‌కు ఆధిక్యం ఖాయమనిపించిన దశలో కార్స్‌ను సిరాజ్ బౌల్డ్ చేయగా.. వోక్స్, టంగ్ (11)లను బుమ్రా అవుట్‌చేసి భారత్‌కు 6 పరుగుల ఆధిక్యం అందించాడు.

**నిలకడగా...:** భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జైస్వాల్ (4) నాలుగో ఓవర్‌లోనే వెనుదిరిగినా.. సాయి సుదర్శన్‌తో కలిసి మరో ఓపెనర్ రాహుల్ పరిస్థితిని చక్కదిద్దాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన సుదర్శన్ ఈసారి ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. 24 పరుగుల వద్ద సుదర్శన్ క్యాచ్‌ను డకెట్ వదిలేశాడు. అయితే కాసేపటికే అతడిని స్టోక్స్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 24వ ఓవర్‌లో వర్షం రావడం, అప్పటికే సమయం ఆరు కావడంతో మూడో రోజు ఆటను ముగించారు.




# చాన్సిస్తే కోచ్‌గా పనిచేస్తా

భవిష్యత్‌లో టీమిండియా ప్రధాన కోచ్‌గా పని చేయాలనుందని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తెలిపాడు. అలాగే రాజకీయాల్లోకి వెళ్లాలన్న ఆసక్తి తనకెంతమాత్రం లేదని తేల్చాడు. '2013లో క్రికెట్ నుంచి తప్పుకొన్నాక బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేశా. నాకింకా 53 ఏళ్లే కాబట్టి భవిష్యత్ ఎలా ఉంటుందో చూద్దాం. నాకైతే కోచ్‌గా చేయాలని ఉంది. కోచ్ గంభీర్‌కు అంకితభావం ఎక్కువ. ఈ ఇంగ్లండ్ సిరీస్ అతడికి కీలకం కానుంది. ఇక రాజకీయాలపై ఎలాంటి ఆసక్తి లేదు. ముఖ్యమంత్రి పదవిస్తానన్నా అందులోకి వెళ్లను' అని గంగూలీ స్పష్టం చేశాడు. రోహిత్‌కోహ్లీలకు అంత ఈజీకాదు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027లో జరిగే వన్డే వరల్‌డ్‌కప్ దాకా ఆడడం అంత సులువైన విషయం కాదని గంగూలీ అన్నాడు. 'వరల్‌డ్‌క్‌పనకు ముందు భారత జట్టు సుమారు 27 వన్డేలు ఆడుతుంది. అంటే ఏడాదికి సుమారు 15 మ్యాచ్‌లు ఆడాల్సిరావడం వారిద్దరికీ కష్టమైన విషయం' అని సౌరవ్ చెప్పుకొచ్చాడు. మరోవైపు 2003 వన్డే వరల్‌డ్‌కప్ జట్టుకు ఎంపిక చేయనందుకు లక్ష్మణ్ తనతో మూడు నెలలపాటు మాట్లాడలేదని అప్పట్లో కెప్టెన్‌గా ఉన్న దాదా చెప్పాడు. ఆ వరల్‌డ్‌కప్‌లో లక్ష్మణ్ స్థానంలో దినేష్ మోంగియాను తీసుకున్నారు.



## భారత్‌కు ఏడు పతకాలు ఖాయం

తూర్పు ఆఫ్రికా దేశమైన సిషెల్స్‌లో జరుగుతున్న నేషనల్ డే బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు దేశానికి ఏడు పతకాలు ఖాయం చేశారు. పురుషుల విభాగంలో ఆదిత్య ప్రతాప్ (65 కిలోలు), నీరజ్ (75 కి.), హిమాన్షు శర్మ (50 కి.), ఆషిష్ ముద్ధనియ (55 కి.), అన్మోల్ (60 కి.), కార్తీక్ దలాల్ (70 కి.) ఫైనల్ చేరి మెడల్స్ ఖాయం చేసుకున్నారు.



## పురుషుల జట్టుకు టీమ్ టైటిల్

**అండర్-23 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో మనోళ్లు పురుషుల ఫ్రీస్టయిల్ టీమ్ టైటిల్ దక్కించుకున్నారు. టోర్నీలో పురుషుల జట్టు ఆరు స్వర్ణాలు, ఒక రజత పతకంతో దుమ్ము రేపింది. మరోవైపు భారత మహిళలు కూడా టీమ్ టైటిల్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. 10 విభాగాలలో.. మన మహిళలు ఒక్కో కేటగిరీలో ఒక పతకం గెలుచుకున్నారు. ఇక..గ్రీకో రోమన్ విభాగంలో భారత పురుషులు ఒక స్వర్ణం సహా 3 పతకాలు నెగ్గారు.**




# సంబరాల నిబంధనలు కఠినతరం

బెంగళూరు ఘటన నేపథ్యంలో బీసీసీఐ నిర్ణయం

న్యూఢల్లీ: ఐపీఎల్ విజేత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంబరాలు తీవ్ర విషాదంగా మారిన నేపథ్యంలో బీసీసీఐ కఠిన నిబంధనలు ప్రవేశపెట్టింది. ఇక మీదట ఐపీఎల్ విక్టరీ ఈవెంట్‌ను నిర్వహించాలనుకొంటే బోర్డు రూపొందించిన నిబంధనలను కచ్చితంగా అనుసరించాల్సిందేనని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశాడు. బోర్డు రూల్స్ ప్రకారం ఇక మీదట టైటిల్ నెగ్గిన 34 రోజుల్లోపు సంబరాలకు అనుమతిలేదు. అలాగే హడావుడిగా ఏ కార్యక్రమాన్నీ నిర్వహించకూడదు. ఏ విధమైన సెలెబ్రేషన్స్ చేయాలన్నా బీసీసీఐ నుంచి ముందస్తుగా లిఖితపూర్వక అనుమతి తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు, స్థానిక సంస్థల నుంచి క్లియరెన్స్ తప్పనిసరి. పరేడ్‌లో పాల్గొనే జట్టుకు 45 అంచెల భద్రతను ఏర్పాటు చేయాలి. ఎయిర్‌పోర్ట్ నుంచి ఈవెంట్ వేదిక వరకు తగినంత భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈవెంట్ సందర్భంగా ఆటగాళ్లకు, సహాయ సిబ్బందికి కట్టుదిట్టమైన రక్షణ ఉండేలా చూసుకోవాలి. ఈనెల 4న బెంగళూరులో నిర్వహించిన ఆర్సీబీ విక్టరీ సంబరాల్లో తొక్కిసలాట కారణంగా 11 మంది మృతి చెందగా.. ఎంతో మంది గాయాలపాలయ్యారు. ప్రమాదాన్ని ముందే ఊహించిన బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు అనుమతి నిరాకరించినా.. ఫ్రాంచైజీ మాత్రం విక్టరీ పరేడ్‌ను ప్రకటించింది. చిన్నస్వామి స్టేడియం వద్దకు సామర్థ్యానికి మించి ఫ్యాన్స్ చేరుకోవడం తొక్కిసలాటకు దారితీసింది. ప్రమాదంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కర్ణాటక ప్రభుత్వం బీసీసీఐ, ఫ్రాంచైజీనే దీనికి బాధ్యత వహించాలని చెప్పింది.

## సబలెంకకు షాక్

**బెలారస్ భామ, ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ అరినా సబలెంక సూపర్ జోరుకు చెక్ పడిరది. బెర్లిన్ ఓపెన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తోన్న సబలెంకకు సెమీస్‌లో పరాజయం ఎదురైంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చెక్ రిపబ్లిక్ అమ్మాయి మార్కెట ఒండ్రుసోవ 6-2, 6-4తో వరుస సెట్లలో అరినా సబలెంకపై మెరుపు విజయం సాధించింది. నాలుగు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో రెచ్చిపోయిన మార్కెట మహిళల సింగిల్స్ టైటిల్ పోరుకు చేరుకుంది. పాయింట్ల పరంగా 72-55తో సబలెంకపై ఒండ్రుసోవ ఆధిపత్యం సాధించింది. సబలెంక 4 ఏస్‌లు కొట్టినా.. ఒక్క బ్రేక్ పాయింట్ మాత్రమే సాధించింది. రెండు సెట్లలోనూ మార్కెటకు గట్టి పోటీ ఇవ్వటంలో సబలెంక తేలిపోయింది. మరో సెమీఫైనల్లో చైనా అమ్మాయి వాంగ్ 6-4, 6-1తో సమ్సోనోవపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. నేడు మహిళల సింగిల్స్ ఫైనల్లో వాంగ్‌తో ఒండ్రుసోవ పోటీపడనుంది.**

# టీ20 ప్రపంచ కప్‌నకు కెనడా అర్హత

కెనడా జట్టు వచ్చే ఏడాది జరిగే పురుషుల టీ20 ప్రపంచ కప్‌నకు అర్హత సాధించింది. అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో కెనడా ఏడు వికెట్లతో బహామ్సను చిత్తు చేసింది. ఒంటారియో (కెనడా): కెనడా జట్టు వచ్చే ఏడాది జరిగే పురుషుల టీ20 ప్రపంచ కప్‌నకు అర్హత సాధించింది. అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో కెనడా ఏడు వికెట్లతో బహామ్సను చిత్తు చేసింది. ఐదు మ్యాచ్‌ల్లో ఆ జట్టుకిది వరుసగా ఐదో విజయం. కెనడా బౌలర్ల ధాటికి తొలుత ప్రత్యర్థి 19.5 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. అనంతరం 58 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కెనడా 5.3 ఓవర్లలో ఛేదించింది. ఇక 20 దేశాలు తలపడే మెగా టోర్నీలో డిఫెండిరగ్ చాంపియన్ భారత్ ఉన్న గ్రూపునుంచే కెనడా తలపడుతుంది. ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుంచి రెండు, ఆసియాఈఏపీ క్వాలిఫయర్‌స్‌నుంచి మూడు, యూరప్ క్వాలిఫయర్స్ నుంచి రెండు జట్లు వరల్డ్ కప్‌నకు అర్హత సాధించనున్నాయి.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in